# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

22.01.2026 గురువారం Thursday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 195 | పేజీలు : 14 Pages : 14 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana







## మేడారంలో సందడి

- భారీగా తరలివస్తున్న భక్త జనం
- ఘనంగా మండమెలిగె పండగ నిర్వహణ
- గద్దెల వద్ద పూజారులు ప్రత్యేక పూజలు

2



## మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ సిద్ధం



రానున్న మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయడం అంటే జిల్లాల రద్దుకు అంగీకరించడమేనని ఆయన హెచ్చరించారు.

- కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాలు ఎత్తివేయడం ఖాయం
- స్థానిక సమస్యలే ఎజెండాగా ఎన్నికలకు వెళ్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3



## మావోయిస్టు అడ్డాలో పోలీసుల పాగా

**కర్రెగుట్టలో వెలిసిన సీఆర్‌పీఎఫ్ క్యాంప్**

ములుగు జిల్లా వెంకటాపురం మండలం పామునూరు గ్రామ పరిధిలోని కర్రెగుట్టలపై నూతనంగా ఎఫ్ఓబి బేస్ క్యాంప్‌ను అధికారులు ప్రారంభించారు.

3

## వైద్యవిద్యకు పెద్దపీట

- అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3





## రాజకీయ ప్రయోగశాలగా సింగరేణి సంస్థ

- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ పయనం
- అన్ని రకాలుగా సింగరేణి విధ్వంసం
- ప్రభుత్వం కోరితే సీబీఐ విచారణకు సిద్ధం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ, జనవరి 21:** సింగరేణిని రాజకీయ ప్రయోగశాలగా మార్చారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ విధ్వంసం చేస్తున్నాయని ఫైర్ అయ్యారు. నైనీ కోలి విషయంలో కేంద్రం సహకారం అందిస్తోందన్నారు. ఢిల్లీలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ 'సింగరేణిని అన్ని రకాలుగా విధ్వంసం చేశారు. బీఆర్ఎస్ ఎలా పని చేసిందో కాంగ్రెస్ అలానే పనిచేస్తుందన్నారు. దేశ బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి కీలకపాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అయితే, తెలంగాణ వచ్చాక సింగరేణికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. సింగరేణి విషయంలో వివాదం నెలకొన్న నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

మిగతా 2 లో

# దావోస్ సదస్సుకు ఫాలోఅప్

**వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో సీఎం రేవంత్ ప్రతిపాదన**

**వివిధ సంస్థలతో చర్చలు.. ఎంవోయూలు**

- వేయికోట్ల పెట్టుబడులకు సర్గడ్ సంస్థతో ఎంవోయు
- హైదరాబాద్‌లో రీసెర్చ్ సంస్థ ఏర్పాటుకు బ్లైజ్ అంగీకారం
- రష్మీ గ్రూప్ 12500 కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు

> వరల్డ్ ఎననామిక్ ఫోరం ఫాలోఅప్ సదస్సును ఏటా నిర్వహించాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరుగుతున్న సదస్సులో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్‌లో దీన్ని నిర్వహించాలని కోరారు. సీఎం ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు మద్దతు తెలిపారు. ఇదిలావుంటే వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయిన సిఎం రేవంత్ పలు రంగాల్లో పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

**హైదరాబాద్, జనవరి 21:** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 2026 సదస్సు సందర్భంగా అమెరికాకు చెందిన సర్గడ్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం రేవంత్ రెడ్డితో ఆ సంస్థ సీఈఓ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ముందుకు వచ్చింది. రాబోయే 3 నుంచి 5 సంవత్సరాల్లో రూ. 1,000 కోట్ల పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఎమ్ఆర్ఓ కేంద్రాన్ని వరంగల్ లేదా ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

మిగతా 2 లో







## మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి పోటీ చేయదు

- ఎవరు కోరినా మద్దతు ఇస్తాం..
- అవసరమైతే ప్రచారం చేస్తాం
- ఫోన్ ట్యాపింగ్ విచారణ అంతా ఒక డ్రామా
- అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- హరీష్ రావు, కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు

3



## కుక్కల గురించి కాదు.. భర్తలను చంపుతున్న వారి సంగతేంటి

- రేణు దేశాయ్‌కు వీహెచ్ చురకలు

3

రేణు దేశాయ్‌పై వీహెచ్ తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. భర్తలను చంపుతున్నవారి సంగతేంటిది అని ప్రశ్నించారు.

## మున్సిపల్ ఎన్నికల వేళ

- 47 మంది కమిషనర్ల బదిలీ
- తక్షణం విధుల్లో చేరాలని ఆదేశం




2



02

## టాటా ఛైర్మన్‌తో సీఎం భేటీ

- స్టేడియాల అభివృద్ధికి సహకరించాలని వినతి
- తెలంగాణలో ఏబీ ఇన్‌బెవ్ యూనిట్ విస్తరణకు సిద్ధం
- కొత్త మ్యానుఫాక్చరింగ్ యూనిట్ల ఏర్పాటుపై చర్చ

దావోస్ పర్యటన సందర్భంగా టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో సీఎం భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో స్టేడియాల అభివృద్ధికి సహకరించాలని ఆయన్ను సీఎం కోరారు.



# 26-26 ఉగ్రకుట్రకు ప్లాన్

- రిపబ్లిక్ డే రోజున భారత్‌లో దాడులకు స్కెచ్
- పంజాబ్ గ్యాంగ్‌స్టర్లు, పాక్ ఉగ్రసంస్థల కుట్ర..
- నిఘా వర్గాల హెచ్చరికలు

రిపబ్లిక్ డే రోజున భారత్‌లో దాడులకు పాకిస్తాన్ కుట్రలు చేస్తోంది. పాక్ ఉగ్ర సంస్థలు, పంజాబ్ గ్యాంగ్‌స్టర్లు కలిసి దేశంలో విధ్వంసం సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నాయని నిఘా వర్గాలు హెచ్చరించాయి. భారత్‌లోని దేవాలయాలు, కీలక ప్రాంతాలే లక్ష్యంగా ఈ దాడులకు సిద్ధమైనట్లు తెలిపాయి. దీంతో దేశవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించిన భద్రతా బలగాలు.. ఉగ్ర కుట్రలను భగ్నం చేసేందుకు ప్రయత్నాలు చేపట్టాయి.

4వ పేజీలో




# మున్సిపల్ ఎన్నికల వేళ

**47 మంది కమిషనర్ల బదిలీ • తక్షణం విధుల్లో చేరాలని ఆదేశం**

**హైదరాబాద్, జనవరి 21:** మున్సిపల్ ఎన్నికలకు ముందు పలువురు కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు చేపట్టింది. ఏకంగా 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే విధుల్లో చేరాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోతే క్రమశిక్షణా చర్యలు తప్పవని కూడా హెచ్చరించింది. ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు సొంత జిల్లాల్లో ఉన్నవారిని, అలాగే ఒకే చోట మూడేళ్లు దాటిన వారిని మార్చేసినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. బదిలీ అయిన వివరాలు ఇలా ఉన్నాయి. సి.వి.ఎన్. రాజు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎఎ), ఆదిలాబాద్ మున్సిపాలిటీ, ఉమా మహేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎ), ప్రస్తుతం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రటరీగా పని చేస్తున్నారు., కె. సమ్మయ్య, సెక్షన్ ఆఫీసర్, సచివాలయం హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. కీర్తి నాగరాజు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎఎ), చొప్పదండి మున్సిపాలిటీకి, టి. మనోహర్, మేనేజర్, రాయికల్ మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్‌గా విధులు.

**ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ, ఎదులాపురం మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్‌గా విధులు.**

**ఎం. రామదుర్గ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎ), హాలియా మున్సిపాలిటీ.**

**నజీబ్, మేనేజర్, భూత్పూర్ మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్‌గా (ఓడీ ప్రాతిపదికన).**

**నాగరాజు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎఎ), అమర్చింత మున్సిపాలిటీ.**

**కె. సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎఎ), మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్.**

**టి. రమేష్, మేనేజర్, బెల్లంపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్**

**జె. సంపత్, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎఎ), ములుగు మున్సిపాలిటీ.**

**ఎం. రామచంద్రరావు, ఎంపీఓ, కల్లూరు మున్సిపాలిటీ మున్సిపల్ కమిషనర్‌గా (ఓడీ ప్రాతిపదికన).**

**ఎం. మునావర్ అలీ, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎఎ), తిరుమలగిరి మున్సిపాలిటీ.**

**జి. రాజు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎ), క్యాతనపల్లి మున్సిపాలిటీ.**

**పి. చంద్రశేఖర్ రావు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎ), కొల్లాపూర్ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు.**

**ఈ ఉత్తర్వులు తక్షనమే అమల్లోకి వచ్చాయి.**

# మేడారంలో జాతర సందడి

**భారీగా తరలివస్తున్న భక్త జనం**

**ఘనంగా మండమెలిగె పండగ నిర్వహణ**

**గద్దెల వద్ద పూజులరు ప్రత్యేక పూజలు**



**ములుగు, జనవరి 21:** మేడారం సమ్మక్క సారలమ్మ దేవతల మండ మెలిగే పండుగను పూజారులు - అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారంఉదయాన్నే మేడారం సమ్మక్క దేవత పూజరులు సిద్దబోయిన, కొక్కెర, మ్లలెల, వంశీయులు, నె రాలమ్మ పూజారులు కాక వంశీయులు వారి వారి ఇళ్లను శుభ్రం చేసుకున్నారు. అనంతరం పిల్లాపాపలతో సహా పవిత్ర స్నానాలు చేశారు. సమ్మక్క పూజారులు మేడారం గుడికి సారల మ్మపూజారులు కన్నెపెల్లి గుడికి వెళ్లి గుడులను పవిత్ర గోదావరి జలంతో శుద్ధి చేశారు. అనంతరం సమ్మక్క పూజారి ఆయన సిద్ధబో యిన నితిన్, సారలమ్మ పూజారి అయిన కాక సారయ్య ఇండ్ల వద్ద డోలు వాయిద్యాల నడుమ మామిడాకు తోరణాలను కట్టారు. అక్కడినుం డి పూజారులు ఆడపడుచులు (ఆడబిడ్డలు) పూజా సామగ్రితో మంగళ హారతులతో ఆయా గుడులకు చేరుకున్నారు. ఆడబిడ్డలు అడవి నుంచి తెచ్చిన పుట్ట మన్నుతో గుడులను అలికి ముగ్గులు వేశారు. అనంతరం పూజారులు డోలు వాయిద్యాల నడుమ బొడ్రాయి, ముత్యా లమ్మ, భూలక్ష్మి, మహాలక్ష్మి లకు నూతన వస్త్రా లు పెట్టి పసుపు కుంకుమ పెట్టి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అక్కడ నుంచి నేరుగా ఆలయం ముందు బురికా స్తంభాలతో తోరణా నికి చీడపీడలు రాకుండా కోడిపిల్ల, సొరకాయ, మిరపకాయ, మామిడి, వేప మండలు కట్టి తోరణం కట్టారు. అనంతరం గ్రామ పొలిమే రలల్లో బూరిక చెట్లతో తోరణాలు కట్టారు. సాయంత్రం డోలు వాయిద్యాల నడుమ గద్దెల వద్దకు చేరుకొని రహస్య పూజలు చేశారు. దీంతో మహాజాతరకు అంతా సిద్ధమ ని పూజారులు తెలిపారు. ఇదిలావుంటే గత వారం రోజులుగా భక్తుల పెద్ద ఎత్తున పోటెత్తారు. భారీగా తరలి వస్తున్నారు. దీంతో పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.



# దావోస్ సదస్సుకు ఫాలోఅప్‌గా హైదరాబాద్ సదస్సు

మొదటి పేజీ తరువాయి

దీంతో రాష్ట్రం.. విమానయాన, ఏరోస్పేస్ రంగాల్లో మరింత బలోపేతమయ్యే అవకాశం ఉంది. అలాగే.. కాలిఫోర్నియా కేంద్రంగా ఉన్న బ్లైజ్ కంపెనీతో మరో ఎంవోయూ కుదిరింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వేదికపై సీఎం రేవంత్ రెడ్డితో సీఈఓ దినాకర్ మునగాలా సమావేశమయ్యారు. హెల్త్‌కేర్, మాన్యుఫ్యాక్చరింగ్, ఎఐ ఎనర్జీ రంగాల్లో పైలట్ ప్రాజెక్టులపై చర్చలు జరిగాయి. తక్కువ విద్యుత్ వినియోగంతో ఎఐహార్డ్‌వేర్, ఫుల్-స్టాక్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో బ్లైజ్ సంస్థ అగ్రగామి. ఈ ఒప్పందం ద్వారా హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ సెంటర్ విస్తరణకు బ్లైజ్ నిర్ణయం తీసుకుంది. ఈ ఒప్పందంతో తెలంగాణలో ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, ఎఐ రంగాలకు ఊపిరి లభించనుంది. తెలంగాణను ఎఐ డేటా సెంటర్ హబ్‌గా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభంకానుందని మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. అంతేకాకుండా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం రష్మి గ్రూప్‌తో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన భారీ ఎంవోయూ కుదుర్చుకుంది. తెలంగాణలో రష్మి గ్రూప్ ఆధునిక స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. దీనికి సుమారు 12,500 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో 12 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్ష ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉంది. డక్టైల్ ఐరన్ పైపుల తయారీలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన రష్మి గ్రూప్... ఆసియా, యూరప్, ఆఫ్రికా, అమెరికా దేశాల్లో విస్తృత కార్యకలాపాలు నిర్వహిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులు, బొగ్గు లింకేజీలు అందిస్తామని హామీ ఇచ్చింది. గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, సర్క్యులర్ ఎకానమీ విధానాలపై కూడా భాగస్వామ్య చర్చలు జరిగాయి. కాగా.. సీఎం రేవంత్.. జనవరి 20 నుంచి 23 వరకు దావోస్‌లోని డబ్ల్యూఈఎఫ్ 2026 సదస్సులో పాల్గొననున్నారు. పర్యటనలో సీఎంతో పాటు ఐటీ, పరిశ్రమల మంత్రులు డి.శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేశ్ రంజన్, సంజయ్ కుమార్, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి తదితరులు ఉన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను ప్రపంచ నాయకులు, సీఈఓల ముందు ప్రదర్శించడమే ప్రధాన లక్ష్యంగా రేవంత్ దావోస్ పర్యటన కొనసాగుతోంది.



# టాటా చైర్మన్‌తో సీఎం రేవంత్ భేటీ

**స్టేడియాల అభివృద్ధికి సహకరించాలని వినతి**

**ఏబీ ఇన్‌బెవ్ యూనిట్ విస్తరణకు సిద్ధం**



**దావోస్, జనవరి 21:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన కొనసాగుతోంది. బుధవారం ఆయన టాటా గ్రూప్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో స్టేడియాల అభివృద్ధికి సహకరించాలని ఆయన్ను సీఎం కోరారు. విజన్-2047 లక్ష్యాలు, పెట్టుబడులకు ఉన్న అనుకూల విధానాలను వివరించారు. హైదరాబాద్‌లో స్టేడియాల అభివృద్ధికి టాటా గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసింది. మూసీ నది పునరుజ్జీవంలో భాగస్వామ్యానికి, రాష్ట్రంలో హోటళ్లు, రిసార్ట్స్ ఏర్పాటుపై చంద్రశేఖరన్ ఆసక్తి చూపారు. రాష్ట్రంలో కొత్త మ్యానుఫాక్చరింగ్ యూనిట్ల ఏర్పాటుపై కూడా ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఇదిలావుంటే ప్రపంచంలో అతిపెద్ద బీరు తయారీ సంస్థగా పేరుగాంచిన ఏబీ ఇన్‌బెవ్ , తెలంగాణలో ఇప్పటికే ఉన్న తన తయారీ యూనిట్‌ను విస్తరించేందుకు భారీగా పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. ఈ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 50కుపైగా దేశాల్లో సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదికసదస్సులో భాగంగా దావోస్‌లో.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం ఏబీ ఇన్‌బెవ్ చీఫ్ లీగల్ అండ్ కార్పొరేట్ అ్ఫ÷ర్స్ ఆఫీసర్ జాన్ బ్లడ్గో సమావేశమయ్యారు. తెలంగాణలో ప్రస్తుతం రెండు తయారీ యూనిట్లు నిర్వహిస్తున్న ఏబీ ఇన్‌బెవ్, సుమారు 600 మందికి ఉపాధి కల్పిస్తోంది. రాష్ట్రానికి కొత్త పెట్టుబడి లభించినందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ఆదాయ వృద్ధి, సామర్థ్య నిర్మాణమే కీలకమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. విధాన స్థిరత్వం, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, వ్యాపార సౌలభ్యంతో తెలంగాణలో పెట్టుబడిదారుల్లో దీర్ఘకాలికంగా విశ్వాసం పెరుగుతోందని తెలిపారు. ఈ సమావేశంలో సర్క్యులర్ వాటర్ వినియోగం, మహిళా సాధికారత, విద్య, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించిన సీఎస్ఆర్ వ్యయాలు వంటి అంశాల్లో తెలంగాణతో కలిసి పనిచేసే అవకాశాలపై కూడా చర్చించారు.

# హైదరాబాద్‌లో తొలి స్విస్ మాల్

**దావోస్ వేదికగా రేవంత్ రెడ్డితో అవగాహన**



**దావోస్, జనవరి 21:** ప్రపంచ ఆర్థిక వేదిక దావోస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, స్విట్జర్లాండ్‌లోని వాడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి క్రిస్టెల్ లూసియర్ బ్రోడార్‌తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో భారత్-స్విట్జర్లాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య సహకార పెంపుపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్-2047 విజన్‌ను స్విస్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌లో ప్రపంచంలోనే తొలిసారి 'స్విస్ మాల్' ఏర్పాటు చేయాలనే ఆలోచనను ముఖ్యమంత్రి ప్రతిపాదించగా, స్విస్ బృందం వెంటనే సానుకూలంగా స్పందించింది. ఇద్దరు ముఖ్యమంత్రులు ఫుట్‌బాల్ ఆటగాళ్లే కావడంతో, క్రీడల రంగంలో భాగస్వామ్యంపై కూడా విస్తృతంగా చర్చించారు. క్రీడా శిక్షణ, మౌలిక వసతుల అభివృద్ధిలో కలిసి పనిచేయవచ్చని అభిప్రాయ పడ్డారు. సంస్కృతి, విద్య, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ రంగాల్లో.. ముఖ్యంగా హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, క్రీడల విభాగాల్లో.. పరస్పర సహకారానికి అవకాశాలపై లీడర్లు అభిప్రాయాలు పంచుకున్నారు. రిటైల్ , లైఫ్ సైన్సెస్‌లో రంగాల్లో అవకాశాలపై చర్చించారు. మహిళా సాధికారతకు సంబంధించి స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలపై స్విస్ బృందం ఆసక్తి కనబరిచింది. సహకార అంశాలు పరిశీలించేందుకు త్వరలోనే స్విట్జర్లాండ్ బృందం హైదరాబాద్‌కు వస్తుందని వాడ్ రాష్ట్ర పరిశ్రమలు, ఆర్థిక శాఖ మంత్రి ఇసబెల్ మోరెట్ తెలిపారు.

# హైదరాబాద్‌లో తొలి బ్యూటీ టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్

**సిఎం రేవంత్‌తో లోరియల్ సంస్థసిఇవో భేటీ**

**దావోస్, జనవరి 21:** ప్రపంచంలోనే తొలి బ్యూటీ టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ను హైదరాబాద్లో ఏర్పాటు చేస్తున్నట్లు లోరియల్ సంస్థ ప్రకటించింది. ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్లో ప్రారంభించనుంది. దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లోరియల్ సీఈవో నికోలస్ హియోరోనిమస్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో లో హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ?టెక్ జీసీసీ ఏర్పాటు చేసే నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ జీసీసీ ఏర్పాటుతో లోరియల్‌కు గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా నిలవనుంది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ, అనలిటిక్స్ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందిస్తామని హియెరోనిమస్ తెలిపారు. దీంతో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాలకు హైదరాబాద్ ప్రాముఖ్యత మరింత పెరుగనుంది. నవంబర్‌లో జీసీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లను లోరియల్ ఆహ్వానించింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. లోరియల్ జీసీసీని హైదరాబాద్‌కు తీసుకురావాలన్న ఆలోచనపై ముఖ్యమంత్రి ప్రత్యేక ఆసక్తి చూపారని, ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనువైన ప్రదేశమని చెప్పారు. మెడ్‌టెక్, హెల్త్‌టెక్ మాత్రమే కాకుండా బ్యూటీ?టెక్ వంటి కొత్త విభాగాల్లోనూ తెలంగాణ ముందుంటోందని మంత్రి అన్నారు. ఇప్పటికే మారియెట్, వ్యాన్ గార్డ్, నెట్ ఫ్లిక్స్, మెక్ డోనాల్డ్స్, హినెకెన్ , జాగర్ , కోస్ట్కో వంటి గ్లోబల్ కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీలను ఏర్పాటు చేశాయన్నారు. తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ (÷ుఎఐ) గురించి ప్రతినిధి బృందం ఈ సందర్భంగా వివరించింది. జీసీసీతో పాటు మాన్యుఫాక్షరింగ్ యూనిట్ ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అవకాశాలను పరిశీలించాలని లోరియల్ను ఆహ్వానించారు. రాష్ట్రంలో ఉన్న మౌలిక వసతులు, పరిశ్రమల ఎకోసిస్టమ్‌ను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో తయారీ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు హియెరోనిమస్ సానుకూలంగా స్పందించారు.

**దావోస్ వేదికపై చిరు ప్రత్యక్షం**

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో మెగాస్టార్ చిరంజీవి తళుక్కుమన్నారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డితో కలిసి ప్రముఖ సినీనటుడు చిరంజీవి పాల్గొన్నారు. చిరంజీవి తన కుటుంబంతో కలిసి విహారయాత్ర కోసం స్విట్జర్లాండ్‌కు వెళ్లారు. ఈ సమయంలోనే దావోస్ లో ప్రపంచ ఆర్థిక సదస్సు జరుగుతుండటంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. చిరంజీవిని అక్కడికి ఆహ్వానించారు. చిరంజీవి ఆ దేశంలోని జ్యూరిక్‌లో ఉన్నారని తెలుసుకున్న ముఖ్యమంత్రి.. సదస్సుకు రావాలని ఆహ్వానించడంతో ఆయన కూడా హాజరయ్యారు. సదస్సు వేదికపై ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ ను చిరంజీవి చూశారు.

# రాజకీయ ప్రయోగశాలగా సింగరేణి

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు సింగరేణిని అన్ని రకాలుగా విధ్వంసం చేశాయని ఆరోపించారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ వెళ్తోందని విమర్శించారు. సింగరేణి రాజకీయ ప్రయోగశాలగా మారిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో అనేక రకాల అక్రమాలు జరిగాయి. రాష్ట్ర విద్యుత్ సంస్థలకు విద్యుత్ కోసం తెలంగాణకు నైనీ కోల్ బ్లాక్ కేటాయించారు. దానికి కేంద్రం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలున్నాయి. గతంలో నైనీ కోల్ బ్లాక్ టెండర్ల ప్రక్రియలో సీఎం జోక్యం చేసుకొని రద్దు చేశారు. సింగరేణి మైనింగ్‌కు ముందుకొస్తే బీఆర్ఎస్ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిందన్నారు. బొగ్గు గనుల కొరత ఉందని తెలిసి ప్రైవేటు వ్యక్తులకు ఎలా ఇస్తారని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. సింగరేణి, నైనీ కోల్ బ్లాక్ అక్రమాలపై చర్చ జరగాలని, సీబీఐ దర్యాప్తునకు రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఒడిశాలో బీజేపీ వచ్చాక అక్కడి ప్రభుత్వంతో అనుమతులపై చర్చించాను. నైనీ బొగ్గు గనులకు చివరి పర్మిషన్ వచ్చాక పనులు ఎందుకు ఆలస్యం చేశారు? బీఆర్ఎస్ హయాంలోనూ అనేక అక్రమాలు జరిగాయి. ఆరోజు కొందరు వ్యక్తులకు లాభంగా చేకూరేలా వ్యవహరించారు. సింగరేణి అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరగాలి. రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుంది. సింగరేణి మైనింగ్కు ముందుకు వస్తే, చెయ్యలేమని ప్రైవేట్‌కు కట్టబెట్టారు. సంస్థని బెదిరించి లేఖ రాయించారు. ఈ వివాదంలోకి నన్ను కూడా లాగుతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసింది.. సింగరేణి భవిష్యత్తు ప్రమాదకరంగా మార్చారు. సంస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని అన్నారు. కలో ఇండియాలో విలీనంపై మాట్లాడుతూ పరిశీలిస్తున్నామని అన్నారు. మెట్రో రెండో దశ తదితర అంవాలపైనా ఆయన తన అభిప్రాయాలు వెల్లడించారు. అందుకే సిఎంకు లేఖరాశానని అన్నారు.



# మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి పోటీ చేయదు

- ఎవరు కోరినా మద్దతు ఇస్తాం..
- అవసరమైతే ప్రచారం చేస్తాం
- ఫోన్ ట్యాపింగ్ విచారణ అంతా ఒక డ్రామా
- అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- హరీష్ రావు, కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు



హైదరాబాద్, జనవరి 21: తెలంగాణ జాగృతి ఇంకా పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారలేదని, అందుకే త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో తమ సంస్థ పోటీ చేయడం లేదని అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుడు ముచ్చర్ల సత్యనారాయణ జయంతి వేడుకల సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరు మద్దతు కోరినా ఇస్తామని, అవసరమైన చోట తాను స్వయంగా ప్రచారం చేస్తానని కవిత ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండానే ప్రభుత్వం ఎన్నికలకు వెళ్తోందని, దీనిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు బీసీలను మభ్యపెడుతున్నాయని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ తుది దశకు చేరుతుందనే నమ్మకం తనకు లేదని కవిత అన్నారు. "గుంపు మేస్త్రీ (రేవంత్ రెడ్డి), గుంట నక్క (హరీష్ రావు) ఇద్దరూ కలిసే ఉన్నారు. విచారణ పేరుతో డ్రామాలు ఆడుతున్నారు" అని ఘాటుగా విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని డైవర్ట్ చేయడానికే హరీష్ రావుకు నోటీసులు ఇచ్చి హడావిడి చేస్తున్నారని ఆరోపించారు. కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు కసరత్తు వేగంగా జరుగుతోందని, జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని హింట్ ఇచ్చారు. పార్టీ పేరు ఇంకా ఖరారు కాలేదని, 'తెలంగాణ రాష్ట్ర జాగృతి సమితి' అనే సూచనలు వస్తున్నాయని తెలిపారు. తన ప్రధాన టార్గెట్ హరీష్ రావు అని, కేటీఆర్‌ను కూడా వదిలేది లేదని, బలమైన పొలిటికల్ ఎజెండాతో ముందుకు వస్తానని స్పష్టం చేశారు. తాను ఇప్పుడు బీఆర్ఎస్‌లో లేనని, కేసీఆర్ నోటీసుల అంశం తనకు తెలియదని చెప్పారు. ట్యాంక్ బండ్ పై ముచ్చర్ల సత్యనారాయణ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మార్చి 10వ తేదీతో 'జాగృతి జనంబాట' ముగుస్తుందని, ఆ తర్వాత మంత్రుల అవినీతిపై ర్యాంకులు ప్రకటిస్తామని హెచ్చరించారు.

# మావోయిస్టు అడ్డాలో పోలీసుల పాగా

## కర్రెగుట్టలో వెలిసిన సీఆర్‌పీఎఫ్ క్యాంప్




**ములుగు, జనవరి 21:** దశాబ్దాలుగా మావోయిస్టులకు సురక్షిత ప్రాంతంగా, వారి ఆయుధ కర్మాగారాలకు , ముఖ్య నాయకులకు షెల్టర్ జోన్‌గా ఉన్న ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని కర్రెగుట్ట అటవీ ప్రాంతం ఇప్పుడు పోలీసుల అధీనంలోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న మావోయిస్టు రహిత భారత్ లక్ష్యంలో భాగంగా, వెంకటాపురం మండలం పామునూరు గ్రామ పరిధిలోని కర్రెగుట్టలపై నూతనంగా ఎఫ్‌ఓబి బేస్ క్యాంప్‌ను అధికారులు ప్రారంభించారు. సీఆర్‌పీఎఫ్ 39వ బెటాలియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ బేస్ క్యాంప్‌ను సీఆర్‌పీఎఫ్ ఐజీ త్రివిక్రమ్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది దేశ భద్రతా చరిత్రలో ఒక గొప్ప రోజని అభివర్ణించారు. తెలంగాణ ప్రభుత్వ చొరవతో, మురుమూరు బేస్ క్యాంప్ ఏర్పాటు చేసిన కేవలం రెండు నెలల వ్యవధిలోనే దుర్భేద్యమైన కర్రెగుట్టలపై పట్టు సాధించి ఈ రెండో క్యాంప్‌ను ఏర్పాటు చేయడం విశేషమని ఆయన కొనియాడారు. ఈ బేస్ క్యాంప్ ఏర్పాటు వెనుక అధికారుల , ఇంజనీర్ల అలుపెరగని కృషి దాగి ఉంది. వాజేడు మండలం మొరుమూరు బేస్ క్యాంప్ నుండి కర్రెగుట్టల వరకు సుమారు 8.3 కిలోమీటర్ల మేర దట్టమైన అటవీ ప్రాంతంలో రహదారిని నిర్మించారు. భారీ యంత్రాలు, క్రైన్‌ల సహాయంతో గుట్టలపై విశాలవంతమైన రహదారిని నిర్మించడానికి అధికారులు సుమారు 50 రోజుల పాటు అహోరాత్రులు శ్రమించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తి కావడంతో ఇప్పుడు బలగాల రాకపోకలు సులభతరం కావడమే కాకుండా, మావోయిస్టుల కదలికలకు అడ్డుకట్ట పడింది. బేస్ క్యాంప్ ప్రారంభం అనంతరం ఐజీ విక్రమ్ పామునూరు గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న రోజుల్లో జెల్లా, డోలి, తడపాల మీదుగా మరిన్ని రహదారులు నిర్మించి బేస్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. మావోయిస్టుల ముఖ్య క్యాడర్ ఇప్పటికే లొంగిపోయారని, ప్రస్తుతం కొన్ని చిన్న పార్టీలు మాత్రమే మిగిలి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వారు కూడా తెలంగాణ పోలీసులు పిలుపునిచ్చిన 'పోరు కన్నా ఊరు మిన్న' కార్యక్రమం ద్వారా లొంగిపోయి, ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాసాన్ని అందిపుచ్చుకుని జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన పిలుపునిచ్చారు. కర్రెగుట్టల నుంచి పలు గ్రామాల దిశగా రహదారి పనులు చకచకా సాగుతుండటంతో స్థానిక గిరిజన గ్రామాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ పథకాలు నేరుగా తమ దరికి చేరుతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల రాకతో భద్రతా భావం పెరిగిందని, కర్రెగుట్టలు ఇకపై మావోయిస్టుల స్థావరాలుగా కాకుండా అభివృద్ధికి కేంద్రాలుగా మారుతాయని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణలో వైద్యవిద్యకు పెద్దపీట



## అన్ని వర్గాల సంక్షేమమే మా లక్ష్యం ■ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**జగిత్యాల, జనవరి 21:** తెలంగాణలో విద్య, వైద్యం, అన్ని వర్గాల సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో బుధవారం రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనం, రూ.10 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం, రూ.17 కోట్లతో వాటర్ ప్లాంటు నిర్మాణం, రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఎస్సీ బాలుర వసతిగృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించాం. ఒకే ప్రాంగణంలో విద్య, ఆటలు, హాస్టల్, ల్యాబ్స్, డైనింగ్, క్రీడలు అన్నీ ఉండేలా ప్రణాళిక రూపొందించాం. పేద కుటుంబాల పిల్లలకు మంచి అవకాశాలు ఇస్తే వారు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని మేం నమ్ముతున్నాం. వెనుకబడిన వర్గాలు చదువులు, ఉద్యోగాల్లో, సమాజ నిర్మాణంలో ముందుకు రావాలంటే ప్రభుత్వం తరఫున చేయాల్సిన కృషి చేస్తున్నాం. అభివృద్ధి అంటే కేవలం భవనాల నిర్మాణం కాదు, ప్రజల జీవితాల్లో మార్పు రావడం. ఎన్నికల సమయంలో చేసిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. పారదర్శకత, నిబద్ధత, సంకల్పంతో ముందుకు సాగుతున్నాం' అని భట్టి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ సిద్ధం

- కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాలు ఎత్తివేయడం ఖాయం
- స్థానిక సమస్యలే ఎజెండాగా ఎన్నికలకు వెళ్తాం
- బీఆర్ఎస్‌వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, జనవరి 21:** రానున్న మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయడం అంటే జిల్లాల రద్దుకు అంగీకరించడమేనని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన పేరుతో సిరిసిల్ల, సిద్దిపేట, వనపర్తి, నిర్మల్ వంటి కొత్త జిల్లాలను ఎత్తివేసేందుకు కుట్ర చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ అంశాన్నే మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. శివరాత్రి లోపలే మున్సిపల్ ఎన్నికలు ముగిసే అవకాశం ఉందని, స్థానిక సమస్యల ఆధారంగానే ప్రజలు తీర్పు ఇస్తారని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో స్థానిక నేతలకే ప్రాధాన్యత ఇస్తామని, ప్రతి ఉమ్మడి జిల్లాకు ఇంచార్జ్‌లను నియమించామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని "రాము.. రెమో" అని సంబోధిస్తూ విమర్శించారు. ఒకవైపు ఫార్ములా-ఈ రేసులో గ్రీన్ కో కంపెనీది కుంభకోణం అంటూనే, మరోవైపు దావోస్‌లో అదే కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరపడం ప్రభుత్వ ద్వంద్వ నీతికి నిదర్శనమని మండిపడ్డారు. సింగరేణి బొగ్గు గనుల విషయంలో మంత్రులు మౌనంగా ఉన్నారని, దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్ లేదా తాను ప్రచారం చేసేది ఏమీ ఉండదని, లోకల్ ఎన్నికలు కాబట్టి స్థానిక నాయకులే ప్రచారాన్ని నడిపిస్తారని కేటీఆర్ స్పష్టం చేశారు. బస్తీ బాట కార్యక్రమం ద్వారా ఇప్పటికే ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని, పదేళ్ల బీఆర్ఎస్ పాలన - రెండేళ్ల కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు.



## కుక్కల గురించి కాదు..

# భర్తలను చంపుతున్న వారి సంగతేంటి

## రేణు దేశాయ్‌కు వీహెచ్ చురకలు

**హైదరాబాద్, జనవరి 21:** రేణు దేశాయ్.. అమల లాంటి వాళ్ళు కుక్కలను చంపొద్దని అంటున్నారని.. మూగ జీవుల గురించి బాగానే మాట్లాడుతున్నారు.. భర్తలను చంపుతున్న భార్యల సంఖ్య పెరుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత హనుమంతరావు అన్నారు. ఒకప్పుడు భర్త కోసం సతిసావిత్రి యముడితో పోరాడింది.. నేడు భర్తలను భార్య.. భార్యలను భర్తలు చంపుకునేది పెరిగిందన్నారు. ఇలా చేస్తుకుంటూపోతే పిల్లల సంగతి ఏంటి..? అని ప్రశ్నించారు. తాజాగా బుధవారం మీడియాతో మాట్లాడిన వీహెచ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ అంశాలపై విద్యావంతులు.. మేధావులు ఆలోచించాలని సూచించారు. ఈ తరహా హత్యలను ఆపేందుకు ప్రయత్నం చేయాలన్నారు. మహిళా సంఘాలు కూడా సమావేశాలు పెట్టి ఆలోచించాలని సూచించారు.ఇదిలా ఉండగా.. జంతు ప్రేమికురాలిగా, సామాజిక అంశాలపై స్పందించే వ్యక్తిగా గుర్తింపు పొందిన సినీ నటి రేణు దేశాయ్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఈసారి ఆమె ఏకంగా దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పునే సవాల్ చేస్తూ, వీధి కుక్కల హత్యలపై తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కుక్కలను వ్యతిరేకిస్తూ వాటిని చంపాలని చూస్తున్న వారికి 'పిచ్చి పట్టింది' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. వీధి కుక్కల విషయంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై రేణు దేశాయ్ కఠినంగా స్పందించారు. 'మొత్తం న్యాయం అనేది ఒక జోక్ అయిపోయింది. దానికి నేనే సాక్ష్యం' అంటూ ఆమె తీవ్రమైన విమర్శలు చేశారు. ఈ తీర్పు ఇచ్చిన జడ్జికి కుక్కల మీద ఏదైనా వ్యక్తిగత ద్వేషం ఉండి ఉండవచ్చని, ఇది మానవత్వంతో ఇచ్చిన తీర్పు కాదని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై తాజాగా వీహెచ్ స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

## రాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో

# నిలబడగలరా

## నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

## టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**నిజామాబాద్, జనవరి 21:** శ్రీరాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో నిలబడే దమ్ము బీజేపీకి ఉందా అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని.. కాంగ్రెస్ తోనే నిజామాబాద్ అభివృద్ధి సాధ్యమని అన్నారు బుధవారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ బీజేపీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ నాయకుల తప్పిదాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని.. వాటిపై నోటీసులు ఇస్తే బాధ ఎందుకని అన్నారు.సింగరేణి విషయంలో పస లేని ఆరోపణలు చేస్తున్నారని.. సింగరేణి కాంట్రాక్టులు బీఆర్ఎస్ హయాంలో జరిగినవి అని అన్నారు. ఆరోపణలపై ఆధారాలు ఉంటే చర్చకు సిద్ధంగా ఉన్నామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో 20 శాతం ఎక్సెస్ టెండర్లు జరిగాయని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినాక అన్ని శాఖలను ప్రక్షాళన చేశామని.. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో జరిగిన లోపాలను సరిదిద్దుతున్నామని అన్నారు. కేటిఆర్, హరీష్ రావులు బట్ట గాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని.. ఎన్నికల లబ్ధికోసం నోటీసులు ఇస్తున్నారనేది సమంజసం కాదని అన్నారు.ఫోన్ ట్యాపింగ్ అనేది అత్యంత నేరం..అలాంటి నేరం బీఆర్ఎస్ నాయకులు చేసారని.. సినీ నిర్మాతలు,స్వంత పార్టీ ఎమ్మెల్యేల ఫోన్ లు కూడా ట్యాప్ చేసారని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. సిట్ విచారణలో రాజకీయ కక్ష కోణం ఎక్కడా లేదని.. నిజంగా తప్పు చేయకుంటే వివరణ ఇచ్చే ప్రయత్నం చేయాలని అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కాంగ్రెస్ ఇచ్చిన సింగరేణి కాంట్రాక్టులు, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన టెండర్లపై చర్చకు రావాలని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. సిఎం బంధువు సృజన్ రెడ్డిపై ఆరోపణలు చేసి దెబ్బ తీయాలనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

# సింగరేణిపై బీఆర్ఎస్ దుష్ప్రచారం

## కవిత ప్రశ్నలకు సమాధనం చెప్పండి: పొన్నం



**హైదరాబాద్, జనవరి 21:** సింగరేణిపై బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. గత ప్రభుత్వం 30 శాతం అధిక కేటాయింపులతో టెండర్లు అప్పగించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కాంట్రాక్టులు పొందిన వాళ్లు.. ఇప్పుడు చెడ్డవాళ్లయ్యారా అని మంత్రి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పొన్నం మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ఎంతో అవినీతి జరిగినట్లు కవిత చెప్పారని.. ఆమె ప్రశ్నలకు ఆ పార్టీ నేతలు సమాధానం ఇవ్వలేదన్నారు. హిల్ట్ పాలసీలపైనా ఇలాగే ఆరోపణలు చేశారని.. అసెంబ్లీలో చర్చ పెడితే బహిష్కరించి పారిపోయారని చెప్పారు.




సంపాదకీయం

# లోక్‌పాల్‌తోనే రాజకీయ అవినీతికి అడ్డుకట్ట!

**త్వం శుంఠ అంటే..త్వం శుంఠ** అన్నట్లుగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు నడుస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి తెగించడం..వేలకోట్లు సంపాదించడం..అధికారం పోయాక, అధికారంలో ఉన్న పార్టీల అవినీతి గురించి ప్రశ్నించడం చూస్తున్నాం. అధికారంలో ఉన్న వారు, అధికారంలో ఉండి విపక్షం లోకి వచ్చిన వారు చేసిన అవినీతి వల్ల ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కోలుకోలేని అప్పుల్లో కూరుకుని పోయాయి. ఇది వాస్తవం. విభజన వల్ల జరిగిన మేలు ఇదే. ఇందుకు నాలుగు పార్టీల నాయకులు బాధ్యులు. బిఆర్‌ఎస్‌గా మారిన టిఆర్‌ఎస్, కాంగ్రెస్, తెలుగుదేశం, వైకాపాలు ఈ అప్పులకు బాధ్యత వహించాలి. తెలుగు రాష్ట్రాల అప్పులను ఈ పార్టీల నుంచి వసూలు చేయాలి. అప్పుడే ఈ రెండు రాష్ట్రాలు అప్పుల ఊబినుండి బయటపడతాయి. ఇకపోతే నేతలకు సవాళ్లు విసురకోవడం అలవాటుగా మారింది. అధికారంలో ఉండగా తాము చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు, ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీలను నిందస్తున్నారు. ఇందులో ఎవ్వరేమీ తక్కువ తినలేదు. అందుకే రాజకీయ అవినీతిపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరగాలి. సాధారణ పోలీసులతో ఇది సాధ్యం కాదు. ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలి. అన్నా హజారే కోరినట్లుగా లోక్‌పాల్ వ్యవస్థను తీసుకుని రావాలి. అప్పుడే స్వతంత్ర దర్యాప్తు కొనసాగుతుంది. అవినీతిపై నిగ్గు తేలుస్తారు. రాజీకయ పార్టీలు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలకు చట్టాలు తేవాలి. ప్రస్తుత సమాజంలో బాగా వేళ్లానుకున్న అవినీతి ఎక్కడయినా ఉందంటే అది రాజకీయ పార్టీల్లోనే. పటిష్ట లోక్‌పాల్ వ్యవస్థ ద్వారానే అవినీతి నేతలను శిక్షించగలం. అందుకు ప్రజా ఉద్యమాలు రావాలి. ఆప్ ఉద్యమంలా కాకుండా ప్రజలు, మేధావులు కలసి ఉద్యమించాలి. ఇక తెలుగు రాష్ట్రాల విషయాలకు వస్తే జగన్, వైకాపా అవినీతిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కెసిఆర్, ఆయన కుటుంబం, బిఆర్‌ఎస్ నేతల అవినీతిపైనా చర్యలు ముందుకు సాగడం లేదు. తాజాగా కాంగ్రెస్ అవినీతి బట్టబయలు అయ్యింది. ఈ క్రమంలో వీరి అవినీతిపై చర్యలు ఉంటాయనుకోవడం కూడా అత్యాశే అవుతుంది. తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. రెండేళ్లుగా సాలీడు దారంలా సాగుతోంది. ఇందులో భాగంగా తాజాగా మాజీ మంత్రి హరీష్‌రావును సిట్ అధికారులు 7 గంటలపాటు విచారించారు. సిట్ విచారణపై ఇప్పుడు బిఆర్‌ఎస్ నేతలు ఎదురుదాడికి దిగుతున్నారు. రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే నాకు నోటీసులు ఇవ్వడం కాదని, రాజకీయంగా కోట్లాడుదాం అని హరీష్ రావు సవాల్ విసిరారు. కాళేశ్వరం సహా అనేక అవినీతి కేసులు ఉన్నా ఆ పార్టీ నేతలు బరితెగించి మాట్లాడుతున్నారు. వారి అవినీతిని ప్రశ్నిస్తున్న అధికార కాంగ్రెస్ నేతలు తామూ అవినీతి బురదలో కూరుకుపోయారు. ఒక్కో మంత్రి మీద ఒక్కో అవినీతి బయటపడుతోంది. దీనినిబట్ట అవినీతి రాజకీయ పార్టీల హక్కుగా మారిందని అర్థం చేసుకోవాలి. ఫోన్ ట్యాపింగ్, ఈ కార్ రేసు, కాళేశ్వరం వంటివననీ పిచ్చకుంట్ల, లొట్టపీసు కేసులని బిఆర్‌ఎస్ వాదిస్తోంది. కాగ్రెస్ పై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర లోనే ఉన్నాయని హరీష్ రావు వ్యాఖ్యానించడం, ఆయన తప్పించుకునే రాజకీయ తెలివిని ప్రదర్శించారని గుర్తించాలి. ఇకపోతే సింగరేణి సంస్థ నిబంధనలు మార్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన బావమరిదికి రూ.1,600 కోట్ల టెండర్లు కట్టబెట్టారని బిఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. బొగ్గు కుంభకోణంపై నిగ్గు తేల్చడం కోసం సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ అనేక కుంభకోణాలకు పాల్పడిందని, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని మండిపడ్డారు. మంత్రుల వద్ద వాటాల పంచాయితీ నడుస్తున్నదని దుయ్యబట్టారు. గతంలో సింగరేణిపై ఏ ప్రభుత్వం కూడా అజమాయిషి చేయలేదని, కానీ, రేవంత్ సర్కార్ మాత్రం అజమాయిషీ చేస్తూ, తద్వారా సంస్థను నిర్వీర్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. మొత్తానికి వజ్రాన్ని వజ్రంతోనే కోయాలని అంటారు. అవినీతి ఆరోపణలను అవినీతి ఆరోపణలతో తిప్పికొట్టడం ఇప్పుడు రాజకీయ పార్టీలకు అలవాటుగా మారింది. సింగరేణి సంస్థకు నష్టం చేకూరేలా చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చినప్పుడు దానిని సరిదిద్దుకొని సంస్థ ఖజానాకు గండి పడకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీది. సింగరేణిపై కాంగరెస్, బిఆర్‌ఎస్ పార్టీలు గద్దల్లా పడి దోచుకుంటున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆరోపించారు. బొగ్గు మంత్రిగా ఉన్నా కిషన్ రెడ్డి ఏం చేస్తున్నట్లు అన్నది చెప్పాలి. కేంద్రం నిజాయితీగా ఎందుకు వ్యవహరించడం లేదు. అవినీతిపరులను ఎందుకు బోను ఎక్కించడం లేదు. ఇవన్నీ శేష ప్రశ్నలు. సాధారణ టెండర్లలోనూ బిడ్ వేసే ముందు కాంట్రాక్టర్లు పనిచేసే ప్రాంతాన్ని సందర్శించి టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న వివరాలతో బేరీజు వేసుకుంటారు. ప్రీబిడ్ సమావేశంలో తమ అనుభవాలు, సమస్యలు, అభ్యంతరాలను అధికారుల ముందు ఉంచి పరిష్కారాలు, వెసులుబాట్లను ప్రతిపాదిస్తారు. కానీ సింగరేణి టెండర్లు మైనింగ్‌కు సంబంధించినవైనందున భౌగోళిక పరిస్థితులతో ముడిపడి ఉంటుంది. అవినీతి వ్యవహారాలు పునరావృతం కాకుండా ఉండాలంటే కచ్చితంగా టెండర్ నోటిఫికేషన్‌లోనే కొత్త షరతులు పెట్టాల్సి ఉంటుంది. ఒడిశా అంగూల్ జిల్లాలోని నైని కోల్ బ్లాక్‌ను 2015లో దక్కించుకున్న సింగరేణి సంస్థ, 2200 ఎకరాల విస్తీర్ణంలోని ఆ బ్లాకులో 200 ఎకరాల విస్తీర్ణానికి బీఆర్‌ఎస్ హయాంలోనే టెండర్లు పూర్తి చేసి, పనులు అప్పగించింది. కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో ఐదేండ్ల పాటు బొగ్గు వెలికితీతకు పిలిచిన ఆ టెండర్లలో ఐదు సంస్థలు పోటీపడ్డాయి. చివరికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి చెందిన వీపీఆర్ సంస్థ టెండర్ దక్కించుకున్నది. రోజుకు 30వేల క్యూబిక్ మీటర్ల ఓబీని ఈ సంస్థ వెలికి తీస్తున్నది. అతను కూడా రాజకీయ పార్టీకి చెందిన వాడే ఆవడంతో అవినీతికి ఆస్కారం ఏర్పడింది. టెండర్ విధానాన్ని పారదర్శకంగా నిర్వహించాలనుకుంటే సైట్‌ను పరిశీలించిన ప్రతి కంపెనీకి ఇప్పటికే సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉన్నది. ఆ మేరకు సుశీ కంపెనీతో పాటు పలు కంపెనీలు కూడా పదేపదే అధికారులకు ఫోన్ చేసి తమకు సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతున్నా అధికారులు జారీ చేయలేదంటే.. ప్రభుత్వ పెద్దల ఆదేశాల కోసం వేచి చూస్తున్నారనేది బహిరంగ రహస్యం. అయితే నైనీ టెండర్లకు సంబంధించి అసలు ఈ సర్టిఫికెట్ ఎవరు జారీ చేయాలనే దానిపైనా సింగరేణిలో స్పష్టత లేదనే ప్రచారం జరుగుతుందంటే పక్రియ ఎంత గుడ్డిగా కొనసాగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ వ్యవహారంలో విచారణ జరగాలి. కాంగ్రెస్ పాలనలో వస్తున్న ఆరోపణలపై విచారణ జరగాలి. బిఆర్‌ఎస్ పదేళ్ల పాపాలపైనా విచారణ సాగాలి. చంద్రబాబు, జగన్ పాపాలపైనా విచారణ జరగాలి. అందుకు లోక్‌పాల్ ఒక్కటే శరణ్యం.

# 26-26 ఉగ్రకుట్రకు ప్లాన్

- రిపబ్లిక్ డే రోజున భారత్‌లో దాడులకు స్కెచ్
- నిఘా వర్గాల హెచ్చరికలు



**న్యూఢిల్లీ, జనవరి 21:** గణతంత్ర దినోత్సవాన్ని లక్ష్యంగా చేసుకుని భారత్‌లో ఉగ్రదాడులు జరిగే అవకాశాలున్నాయని నిఘా వర్గాల తాజా సమాచారం. ఈ సమాచారంతో ఢిల్లీలో భద్రతా బలగాలు బుధవారంనాడు అప్రమత్తమయ్యాయి. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ ఈ ఉగ్రదాడులకు సహకరించనున్నట్టు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. జనవరి 26న దేశంలోని పలు ప్రాంతాల్లో జరిపే ఈ దాడులకు '26-26' అనే కోడ్ నేమ్ పెట్టినట్టు తెలిపాయి. దేశంలోని పలు ఆలయాలు, నగరాలతో పాటు అయోధ్యలోని రామాలయం, జమ్మూలోని రఘునాథ్ ఆలయం ఉగ్రవాదుల టా÷-గ్గ÷ట్‌లో ఉన్నట్టు భద్రతా బలగాలు తెలిపాయి. పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్, పంజాబ్ బేస్డ్ గ్యాంగ్‌స్టర్లతో ఐఎస్ఐ ఈ ఉగ్రదాడులకు ఎ÷-లాన్ చేస్తున్నట్టు పేర్కొన్నాయి. గత నవంబర్‌లో ఎర్రకోట వెలుపల జరిగిన కారుబాంబు పేలుడు ఘటన వెనుక జైషే మహ్మద్ ఉంది. కాగా, నిఘా వర్గాల సమాచారంతో అప్రమత్తమైన అధికారులు జమ్మూకశ్మీర్, ఢిల్లీ, పంజాబ్ వంటి కీలక ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. అనుమానితుల పోస్టర్లను ఢిల్లీలో పలు చోట్ల ఏర్పాటు చేశారు. ప్రధానంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాల్లో వీటిని ఉంచారు.గత ఏడాది ఏప్రిల్‌లో లష్కరే తొయిబా ఉగ్రసంస్థ పహల్గాంలో జరిపిన ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. గత వారం లష్కరే సంస్థ జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదానికి కట్టుబడి ఉన్నామని బహిరంగంగా ప్రకటించింది. హిందువులకు వ్యతిరేకంగా లష్కరే కమాండర్ విద్వేషపూరిత ప్రసంగం చేశాడు. హిందువుల కుత్తుకలు కోసినప్పుడే 'ఫ్రీడం' సాధ్యమని పీఓకేలో జరిగిన ఒక కార్యక్రమంలో అబూ మూసా కశ్మీరీ చేసిన ప్రసంగం వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. పహల్గాం ఉగ్రదాడికి ముందు కూడా కశ్మీరీ ఇలాంటి వ్యాఖ్యలే చేశాడు. దీంతో భారత్‌పై దాడులకు మరింత భారీ కుట్ర చేసే అవకాశాలు ఉండవచ్చని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

# ఐరోపా దేశాల తీరుపై ట్రంప్ అసహనం

అమెరికాలో ఆర్థికంగా అభివృద్ధి సాధించాం

గ్రీన్ లాండ్‌పై వెనకడుగు లేదన్న ట్రంప్

**దావోస్, జనవరి 21:** ఐరోపా దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఐరోపా కూటమి సరైన దిశలో వెళ్లడం లేదని విమర్శించారు. పెద్దఎత్తున వచ్చే వలసలపై ఇక్కడ నియంత్రణ లేదన్నారు. స్విట్జర్లాండ్ లోని దావోస్ వేదికగా జరుగుతున్న 'ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొని ప్రసంగించిన ఆయన.. తన పాలనలో అమెరికా అభివృద్ధి పథంలో అద్భుతంగా దూసుకెళ్తుందన్నారు. దేశంలో ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేశామని, ప్రపంచ ఆర్థిక ఇంజిన్‌గా అమెరికా నిలుస్తోందన్నారు. ఈ సదస్సుకు హాజరైన ఎంతో మంది మిత్రులు, కొందరు శత్రువులకు శుభాకాంక్షలు. నన్ను ఎన్నుకున్నందుకు అమెరికా ప్రజలు సంతోషంగా ఉన్నారు. రెండేళ్ల క్రితం మాది నిర్జీవ ఆర్థిక వ్యవస్థగా ఉండేది. ఇప్పుడు మళ్లీ సజీవంగా మారింది. ఐరోపాలో కొన్ని ప్రాంతాలకు ఇంకా గుర్తింపు లేదు. ఈ ఖండం అంటే నాకు చాలా ఇష్టం. కానీ, అది సరైన దిశలో వెళ్లడం లేదు. గతంలో జరిగిన నష్టాలను పునరుద్ధరించుకునేందుకు విదేశాలపై సుంకాలు పెంచుతున్నాం. ఇప్పటికే చాలా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాం అని వివరించారు. అమెరికా వృద్ధిపథంలో దూసుకెళ్తోంది. ఎంతో కాలం వెనెజువెలా కూడా అద్భుతంగా ఉండేది. కానీ, సొంత విధానాలతో వాళ్లకు వాళ్లే నాశనం చేసుకున్నారు. దాడి తర్వాత మాతో డీల్ కుదుర్చుకున్నారు. విండ్‌మిల్స్‌ను తయారు చేసి ఐరోపాకు అమ్ముతున్న చైనా భారీగా లాభాలు పొందుతోంది. పక్షులకు హాని కలిగించే, ప్రకృతిని నాశనం చేసే వాటిని తెలివితక్కువ వారే కొంటారు. ఎనర్జీతో నగదు సంపాదించుకోవాలి కానీ కోల్పోకూడదు అని ట్రంప్ హితవు పలికారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సామ్రాజ్యవాద ధోరణిని కొనసాగిస్తున్నారు. ఇటీవలే వెనిజువెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి.. అక్కడి ప్రభుత్వాన్ని తన గుప్పిట్లోకి తెచ్చుకున్న ట్రంప్.. ఈసారి దావోస్ సదస్సులో గ్రీన్‌లాండ్‌ను హస్తగతం చేసుకుంటామని తేల్చి చెప్పారు. ప్రపంచ నేతల ముందే తాము మంచుముక్కను మాత్రమే అడుగుతున్నామని, అది కూడా గ్రీన్‌లాండ్‌కు రక్షణకోసమేనని ఆయన అన్నారు. అంతేకాదు ప్రపంచ ఆర్థిక సదస్సు సాక్షిగా 'భారత్, పాకిస్థాన్ యుద్ధాన్ని నేనే ఆపాను' అని ట్రంప్ పాత పాటే మళ్లీ పాడారు. ఈ ప్రపంచంలో గ్రీన్‌లాండ్‌ను సురక్షింతంగా చూసుకోగల దేశం అమెరికా మాత్రమే. వ్యూహాత్మక స్థావరమైన ఈ దేశాన్ని మేము కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. మా ప్రతిపాదనకు అవును, కాదు అని ఎంతమంది చెబుతారు. ఏదిఏమైనా అమెరికా మాత్రం గ్రీన్‌లాండ్‌ను వదులుకోదు. ఇక నాటోకు మేము చాలా నిధులు ఇస్తున్నాం. కానీ, బదులుగా మెరికాకు ఏమాత్రం లబ్ధి చేకూరడం లేదు. యూరప్ సరైన మార్గంలో వెళ్లడం లేదు. కానీ, యూరప్ సంరక్షణకు అమెరికా ఎల్లప్పుడూ ప్రాధాన్యమిస్తుంది. అయితే.. వామపక్ష విధానాల కారణంగా యూరప్ శక్తిసామర్థ్యాలు దారుణంగా తగ్గిపోయాయి. గ్రీన్ ఎనర్జీ, భారీగా వలసలు.. ఆ ప్రాంతాన్ని ఘోరంగా దెబ్బతీశాయి' అని ట్రంప్ వెల్లడించారు.



# నాకేదైనా జరిగితే ..ఇరాన్ ఔట్

ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

**వాషింగ్టన్, జనవరి 21:** ఇరాన్‌ను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై ఇరాన్ హత్యకు పాల్పడితే.. ఆ దేశాన్ని అమెరికా భూస్థాపితం చేస్తుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో ఓ మీడియా సంస్థ ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తనపై ఏదైనా హత్యాయత్నం జరిగి, దాని వెనక ఇరాన్ హస్తం ఉందని తేలితే.. ఆ దేశాన్ని తుడిచిపెట్టేయాలని తన సలహాదారులను ఆదేశించినట్లు ట్రంప్ ఇప్పటికే ఓసారి వ్యాఖ్యలు చేశారు. తాజాగా మరోసారి అదేతరహా హెచ్చరికలు చేశారు. కాగా.. డిసెంబర్ నుంచి పాలకులకు వ్యతిరేకంగా ఇరాన్ ప్రజలు నిరసనలు చేపడుతున్నారు. దీంతో తమ దేశంలో నెలకొన్న ఆందోళనలకు అమెరికా అధ్యక్షుడే కారణమని ఆయతుల్లా అలీ ఖమేనీ ఆరోపించగా.. ఇరాన్‌లో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని ఆ నిరసనకారులకు ట్రంప్ మద్దతు పలుకుతున్న సంగతి తెలిసిందే. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఖమేనీ పాలన అంతం కావాలని పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ నాయకుడే లక్ష్యంగా ఏదైనా దురాక్రమణ జరిగితే.. దానిని తాము దీటుగా ఎదుర్కొంటామని హెచ్చరించింది. ఇక ఈ నిరసనల్లో 5వేల మంది మృతి చెందినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. 26వేల మంది వరకు అరెస్టయినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ మరణాలకు అమెరికానే కారణమని ఖమేనీ నిందించారు.

# ఢిల్లీలో మరోమారు క్షీణించిన గాలి నాణ్యత

**న్యూఢిల్లీ, జనవరి 21:** ఢిల్లీలో గాలి నాణ్యత మరింతగా క్షీణించాయి. గతంకంటే గాలి నాణ్యతలు కొంత మెరుగుపడినప్పటికీ.. ఎక్యూఐ స్థాయిలు వెరీపూర్ కేటగిరీలోనే కొనసాగతున్నాయి. బుధవారం ఉదయం 9 గంటలకు ఎక్యూఐ 339గా వద్ద నమోదైంది. దీంతో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) వీటి స్థాయిల్ని వెరీపూర్ కేటగిరీలో వర్గీకరించింది. మంగళవారం ఎక్యూఐ 395 స్థాయిల వద్ద నమోదైంది. నిన్నటికంటే ఈరోజుకి గాలి నాణ్యతలు మెరుగుపడ్డాయని సిపిసిబి వెల్లడించింది. ÷ూగా, ఢిల్లీలో 30 వాతావరణ పర్యవేక్షణా కేంద్రాల్లో గాలి నాణ్యతలు 'వెరీ పూర్' కేటగిరీలోనే నమోదయ్యాయి. ఎనిమిది కేంద్రాల్లో పూర్ కేటగిరీలో ఎక్యూఐ స్థాయిలు నమోదైనట్లు సమీర్ యాప్ సమాచారం తెలిపినట్లు సిపిసిబి పేర్కొంది. ఇక ఢిల్లీలో జహంగిర్‌పూర్‌లో గాలి నాణ్యతలు పేలవంగా నమోదయ్యాయి. అక్కడ ఎక్యూఐ స్థాయిలు 390గా నమోదైనట్లు సిపిసిబి పేర్కొంది.



# సనాతన ధర్మంపై ఉదయనిధి వ్యాఖ్యలు

ముమ్మాటికీ విద్వేషపూరితమే: మద్రాస్ హైకోర్టు

**చెన్నై, జనవరి 21:** తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ 2023లో సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ విద్వేష పూరితమైనవే అని మద్రాస్ హైకోర్టు తప్పుపట్టింది. ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై మద్రాస్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సనాతన ధర్మంపై ఉదయనిధి వ్యాఖ్యలు విద్వేషపూరిత ప్రసంగమేనని వ్యాఖ్యానించింది. ఉదయనిధి వ్యాఖ్యలను విమర్శిస్తూ.. భాజపా నేత అమిత్ మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంపై దాఖలైన కేసును హైకోర్టు కొట్టేసింది. ఉదయనిధి 2023లో చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ.. మాలవీయ చేసిన పోస్టు నేరం కిందకు రాదని పేర్కొంది. సనాతన ధర్మాన్ని అనుసరించేవారే లక్ష్యంగా చేసిన రెచ్చగొట్టే ప్రసంగానికి అది ప్రతిస్పందన మాత్రమేనని స్పష్టం చేసింది. ఉదయనిధి ఉపయోగించిన పదజాలంపై అసహనం వ్యక్తంచేస్తూ.. ఆయన చేసిన వ్యాఖ్యలు విద్వేష పూరిత ప్రసంగం కిందకే వస్తాయని పేర్కొంది. తమిళనాడులో మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఎలాంటి కేసు నమోదు కాలేదని, ఇతర రాష్ట్రాల్లో కొన్ని కేసులు నమోదైన విషయాన్ని ప్రస్తావించింది. సెప్టెంబరు 2023లో తమిళనాడులో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడుతూ.. 'సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి' అని వ్యాఖ్యానించారు. ఇది సామాజిక న్యాయానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. దీనిపై అప్పట్లో దేశవ్యాప్తంగా దుమారం చెలరేగింది.



# నాగ్‌పూర్‌లో పరుగుల సునామీ

## కివీస్‌పై భారత్ ఘన విజయం






## తొలి టీ20లో 48 పరుగుల తేడాతో న్యూజిలాండ్ చిత్తు

- సిక్సర్ల వర్షం కురిపించిన అభిషేక్ శర్మ (84)
- ఫినిషింగ్ టచ్ ఇచ్చిన రింకూ సింగ్ (44 నాటౌట్)
- భారీ లక్ష్యఛేదనలో పోరాడి ఓడిన గ్లెన్ ఫిలిప్స్ (78)
- సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి టీమిండియా

**నాగ్‌పూర్, జనవరి 22 :**

నాగ్‌పూర్ వేదికగా బుధవారం జరిగిన భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన తొలి టీ20 మ్యాచ్ అభిమానులకు అసలైన మజాను పంచింది. బౌండరీలు, సిక్సర్లతో హోరెత్తిన ఈ మ్యాచ్‌లో టీమిండియా 48 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యాన్ని సంపాదించింది. భారత యువ బ్యాటర్ల విధ్వంసానికి కివీస్ బౌలర్లు బెంబేలెత్తిపోగా, భారత బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేశారు.

### టాస్ ఓడి.. బ్యాట్‌తో గెలిచి..

టాస్ గెలిచిన న్యూజిలాండ్ కెప్టెన్ బౌలింగ్ ఎంచుకోగా, భారత్ మొదట బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ శుభారంభం అందించే ప్రయత్నం చేసినా, పవర్ ప్లేలో దూకుడుగా ఆడే క్రమంలో వికెట్లు కోల్పోయారు. కానీ, వన్ డౌన్‌లో వచ్చిన యువ సంచలనం అభిషేక్ శర్మ మైదానంలో అడుగుపెట్టినప్పటి నుంచే కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 35 బంతుల్లోనే 84 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏకంగా 8 భారీ సిక్సర్లు, 6 ఫోర్లు ఉండటం విశేషం. స్టేడియం నలువైపులా షాట్లు కొడుతూ నాగ్‌పూర్ ప్రేక్షకులను ఉర్రూతలూగించాడు.

### మిడిల్ ఆర్డర్, ఫినిషర్ల మెరుపులు..

కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (32) తనదైన శైలిలో కొన్ని క్లాసిక్ షాట్లు ఆడి స్కోరు వేగం తగ్గకుండా చూశాడు. ఇక చివర్లో 'ఫినిషర్' రింకూ సింగ్ మరోసారి తన విలువను చాటుకున్నాడు. కేవలం 20 బంతుల్లోనే 44 పరుగులు (నాటౌట్) చేసి, భారత్ స్కోరును 238 పరుగుల భారీ స్థాయికి చేర్చాడు. నిర్ణీత 20 ఓవర్లలో భారత్ 7 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. కివీస్ బౌలర్లలో ఫెర్గూసన్ మినహా మిగతా వారందరూ భారీగా పరుగులు సమర్పించుకున్నారు.

### ఒంటరి పోరాటం చేసిన ఫిలిప్స్..

239 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఆరంభంలోనే తడబడింది. భారత పేసర్లు, స్పిన్నర్లు ఆరంభంలోనే వికెట్లు తీసి కివీస్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. అయితే, గ్లెన్ ఫిలిప్స్ మాత్రం భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా.. మరోవైపు ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. 40 బంతుల్లో 78 పరుగులు చేసిన ఫిలిప్స్ మ్యాచ్‌పై ఆశలు రేకెత్తించినప్పటికీ, అతనికి మిగతా బ్యాటర్ల నుంచి సరైన సహకారం లభించలేదు. డారిల్ మిచెల్, చాప్‌మన్ విఫలమవడంతో కివీస్ ఇన్నింగ్స్ 190/7 వద్దే ఆగిపోయింది.

### బౌలర్ల సమిష్టి కృషి..

భారత బౌలింగ్ దళం సమిష్టిగా రాణించింది. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన మాయాజాలంతో 2 కీలక వికెట్లు తీయగా, పేసర్ శివమ్ దూబే కూడా 2 వికెట్లు పడగొట్టాడు. అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్ పొదుపుగా బౌలింగ్ చేసి కివీస్ పరుగుల వేగానికి కళ్లెం వేశారు. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ విజయంతో సిరీస్‌లో భారత్ ముందంజలో ఉండగా, రెండో టీ20 శనివారం జరగనుంది.

## చరిత్ర సృష్టించిన అభిషేక్ శర్మ

### టీ20ల్లో ప్రపంచ రికార్డు.. సూర్య, రోహిత్ వెనక్కి.. 25 బంతుల్లోపే 8 సార్లు అర్ధశతకాలు

*నాగ్‌పూర్, జనవరి 22: టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ టీ20ల్లో కొత్త చరిత్ర సృష్టించాడు. బుధవారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది పలు రికార్డులు బద్దలు కొట్టాడు. అంతర్జాతీయ టీ20ల్లో 25 బంతుల్లోపే అత్యధిక సార్లు (8 సార్లు) అర్ధశతకాలు సాధించిన బ్యాటర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో సూర్యకుమార్ యాదవ్, ఫిల్ సాల్ట్‌లను వెనక్కి నెట్టాడు. అలాగే కివీస్‌పై అత్యంత వేగంగా (22 బంతుల్లో) హాఫ్ సెంచరీ చేసిన భారత బ్యాటర్‌గా రోహిత్, రాహుల్ రికార్డులను అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో అభిషేక్ 35 బంతుల్లో 84 పరుగులతో విధ్వంసం సృష్టించాడు.*

## బంగ్లాదేశ్‌కు ఐసీసీ షాక్.. భారత్‌లో ఆడాల్సిందే

### వేదికల మార్పు విజ్ఞప్తిని తిరస్కరించిన అంతర్జాతీయ క్రికెట్ మండలి

- భారత్‌లో భద్రతాపరమైన ముప్పు లేదని స్పష్టీకరణ
- షెడ్యూల్ ప్రకారమే కోల్‌కతా, ముంబైలలో మ్యాచ్‌లు
- ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 వరల్డ్ కప్

**దుబాయ్/ముంబై, జనవరి 22:**

వచ్చే నెలలో భారత్‌లో జరగాల్సిన టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌ల వేదికలను మార్చాలంటూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) చేసిన విజ్ఞప్తిని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఖరాఖండిగా తిరస్కరించింది. భారత్‌లో తమ ఆటగాళ్లకు భద్రత లేదంటూ వేదికలను శ్రీలంకకు మార్చాలని బీసీబీ కోరగా.. ఐసీసీ ఆ ప్రతిపాదనను తోసిపుచ్చింది. షెడ్యూల్ ప్రకారమే భారత్‌లో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. బుధవారం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన సమావేశంలో ఐసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. భారత్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లు, అధికారులు, మీడియా, అభిమానులకు భద్రతాపరమైన ముప్పు ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని ఐసీసీ తేల్చి చెప్పింది. వేదికలు మారుస్తే భవిష్యత్తులో ఇతర జట్ల నుంచి కూడా ఇలాంటి డిమాండ్లు వచ్చే ప్రమాదం ఉందని, అది ఐసీసీ తటస్థతను దెబ్బతీస్తుందని బోర్డు అభిప్రాయపడింది. భద్రతా కారణాల రీత్యా తాము భారత్‌కు రాలేమని బీసీబీ ఇటీవల లేఖ రాసిన విషయం తెలిసిందే. అయితే టోర్నీ ప్రారంభానికి (ఫిబ్రవరి 7) సమయం తక్కువగా ఉన్నందున వేదికల మార్పు సాధ్యం కాదని ఐసీసీ తేల్చి చెప్పింది. జనవరి 21లోగా నిర్ణయం తీసుకోవాలని డెడ్‌లైన్ విధించిన ఐసీసీ.. తాజా సమావేశంలో తన నిర్ణయాన్ని వెల్లడించింది. దీంతో బంగ్లాదేశ్ టోర్నీలో పాల్గొంటుందా? లేదా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

### షెడ్యూల్ ఇదే..

భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ మెగా టోర్నీ ఫిబ్రవరి 7న ప్రారంభం కానుంది. షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్ గ్రూప్ దశలో మూడు మ్యాచ్‌లను కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో, ఒక మ్యాచ్‌ను ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఆడాల్సి ఉంది.

## టీ20 ప్రపంచ కప్

## 15 జట్ల స్క్వాడ్స్ విడుదల

### సూర్య సారథ్యంలో భారత జట్టు.. వైస్ కెప్టెన్‌గా అక్షర్

### ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా జట్ల ప్రకటన

***టీ20 ప్రపంచ కప్ కోసం వివిధ దేశాలు తమ జట్లను ప్రకటించాయి. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో భారత జట్టు బరిలోకి దిగుతుండగా, మిగిలిన దేశాలు కూడా తమ బలమైన జట్లను ఎంపిక చేశాయి. ఆయా జట్ల పూర్తి వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి:***

#### భారత జట్టు

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, రింకూ సింగ్, జితేష్ శర్మ (కీపర్).

#### ఆస్ట్రేలియా (తాత్కాలిక)

మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, కూపర్ కొన్నోలీ, ప్యాట్ కమిన్స్, టిమ్ డేవిడ్, కామెరాన్ గ్రీన్, నాథన్ ఎల్లిస్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమాన్, గ్లెన్ మాక్స్‌వెల్, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా.

#### ఇంగ్లాండ్ (తాత్కాలిక)

హ్యారీ బ్రూక్ (కెప్టెన్), రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, టామ్ బాంటన్, జాకబ్ బెథెల్, జోస్ బట్లర్, సామ్ కరన్, లియామ్ డాసన్, బెన్ డకెట్, విల్ జాక్స్, జామీ ఓవర్టన్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, జోష్ టోంగ్, ల్యూక్ వుడ్.

#### దక్షిణాఫ్రికా

ఐడెన్ మార్క్రమ్ (కెప్టెన్), క్వింటన్ డి కాక్, టోనీ డి జోర్జి, డెవాల్డ్ బ్రీవిస్, డేవిడ్ మిల్లర్, డొనోవన్ ఫెరీరా, మార్కో జాన్సెన్, కేశవ్ మహారాజ్, కగిసో రబడ, క్వేనా మఫాకా, లుంగి ఎన్‌గిడి, జాసన్ స్మిత్, కార్బిన్ బాష్, జార్జ్ లిండే.

#### న్యూజిలాండ్

మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), ఫిన్ అలెన్, మైఖేల్ బ్రేస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, జాకబ్ డఫీ, లాకీ ఫెర్గూసన్, మాట్ హెన్రీ, డారిల్ మిచెల్, ఆడమ్ మిల్నే, జేమ్స్ నీషమ్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, టిమ్ సీఫెర్ట్, ఇష్ సోధి.

#### ఆఫ్ఘనిస్థాన్

రషీద్ ఖాన్ (కెప్టెన్), నూర్ అహ్మద్, అబ్దుల్లా, సైదిఖుల్లా అటల్, ఫజల్హాక్ ఫరూకీ, రహ్మానుల్లా గుర్బాజ్, నవీన్ ఉల్ హక్, మహ్మద్ ఇషాక్, షాహిదుల్లా కమల్, మహ్మద్ నబీ, అజ్మతుల్లా ఒమర్జాయ్, దర్విష్ రసూలీ, ఇబ్రహీం జద్రాన్.

#### బంగ్లాదేశ్

లిటన్ దాస్ (కెప్టెన్), తాంజిద్ హసన్, పర్వేజ్ హుస్సేన్ ఎమాన్, సైఫ్ హసన్, తౌహిద్ హృదయ్, షమీమ్ హుస్సేన్, నూరుల్ హసన్ సోహన్, మెహదీ హసన్, రిషాద్ హుస్సేన్, నసుమ్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహమాన్, తంజీమ్ హసన్ సాకిబ్.

#### జింబాబ్వే

సికందర్ రజా (కెప్టెన్), బ్రియాన్ బెన్నెట్, ర్యాన్ బర్ల్, గ్రేమ్ క్రీమర్, బ్రాడ్లీ ఎవాన్స్, క్లైవ్ మదాండే, టినోటెండా మపోసా, తడివానాషే మారుమణి, వెల్లింగ్టన్ మసకద్జా, టోనీ మునియోంగా, బ్లెస్సింగ్ ముజారబానీ, రిచర్డ్ నగరవా.

#### నెదర్లాండ్స్

స్కాట్ ఎడ్వర్డ్స్ (కెప్టెన్), కోలిన్ అకెర్మాన్, నోవా క్రూస్, బాస్ డి లీడే, ఆర్యన్ దత్, ఫ్రెడ్ క్లాసెన్, కైల్ క్లైన్, మైఖేల్ లెవిట్, మాక్స్ ఓడౌడ్, లోగాన్ వాన్ బీక్, టిమ్ వాన్ డెర్ గుగ్టెన్, పాల్ వాన్ మీకెరెన్, సాకిబ్ జుల్ఫికర్.

#### ఐర్లాండ్

పాల్ స్టిర్లింగ్ (కెప్టెన్), మార్క్ అడైర్, రాస్ అడైర్, బెన్ వైట్, కర్టిస్ క్యాంఫర్, గారెత్ డెలానీ, జార్జ్ డాక్రెల్, మాథ్యూ హంఫ్రీస్, జోష్ లిటిల్, బారీ మెక్‌కార్తీ, హ్యారీ టెక్టార్, టిమ్ టెక్టార్, లోర్కాన్ టక్కర్, క్రెయిగ్ యంగ్.

#### నేపాల్

రోహిత్ పౌడెల్ (కెప్టెన్), దీపేంద్ర సింగ్ ఎయిరి, సందీప్ లామిచానే, కుశాల్ భుర్టెల్, ఆసిఫ్ షేక్, సందీప్ జోరా, ఆరిఫ్ షేక్, బసీర్ అహ్మద్, సోంపాల్ కామీ, కరణ్ కెసి, నందన్ యాదవ్, గుల్షన్ ఝా, లలిత్ రాజ్‌బన్షి.

#### ఒమన్

జతీందర్ సింగ్ (కెప్టెన్), వినాయక్ శుక్లా, మహ్మద్ నదీమ్, షకీల్ అహ్మద్, హమ్మద్ మీర్జా, వసీం అలీ, కరణ్ సోనోవాల్, షోయబ్ ఖాన్, నదీమ్ ఖాన్, సుఫ్యాన్ మెహమూద్, జై ఒడెదర, షఫీక్ జాన్, ఆశిష్ రమానంది.

#### కెనడా

దిల్‌ప్రీత్ బజ్వా (కెప్టెన్), అజయ్ వీర్ హుండాల్, అన్ష్ పటేల్, ధిల్లాన్ హెలిగర్, హర్ష్ ఠాకర్, జస్కరన్‌దీప్ భట్టర్, కలీమ్ సనా, కన్వర్‌పాల్, నవనీత్ ధలీవాల్, నికోలస్ కిర్టన్, రవీందర్‌పాల్ సింగ్, సాద్ బిన్ జాఫర్, శ్రేయస్ మోవ్వ.

#### నమీబియా

గెర్హార్డ్ ఎరాస్మస్ (కెప్టెన్), జేన్ గ్రీన్, బెర్నార్డ్ స్కోల్ట్జ్, రూబెన్ ట్రంపెల్మాన్, జె.జె. స్మిత్, జాన్ ఫ్రీలింక్, లారెన్స్, మలన్ క్రుగర్, నికోల్ లాఫ్టీ-ఈటన్, జాక్ బ్రాసెల్, బెన్ షికోంగో, టాంగెని లుంగమెని.

#### ఇటలీ

వేన్ మాడ్సెన్ (కెప్టెన్), మార్కస్ కాంపోపియానో, జియాన్ పియరో మీడే, జైన్ అలీ, అలీ హసన్, క్రిషన్ జార్జ్, హ్యారీ మానెంటి, ఆంథోనీ మోస్కా, జస్టిన్ మోస్కా, సయ్యద్ నఖ్వీ, బెంజమిన్ మనేంటి, జస్‌ప్రీత్ సింగ్, గ్రాంట్ స్మత్స్.



## పవన్ సార్.. ప్రధాని స్థాయికి ఎదిగినా

# ఆశ్చర్యం లేదు

### నటి నిధి అగర్వాల్ సంలచన కామెంట్స్

తన సినిమాల విడుదల సమయాల్లోనే కాకుండా తరచూ ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ పలు ఆసక్తికర విషయాలను పంచుకుంటూ ఉంటారు నటి నిధి అగర్వాల్. తాజాగా ఆమె ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని పవన్ కల్యాణ్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. పవన్ కల్యాణ్ ఎంతోమందికి దేవుడితో సమానం. ఆయనంటే అంత క్రేజ్ ఉంది. అలాంటి అభిమానం కొందరికి మాత్రమే సొంతం. ఆయన కూడా అభిమానులను అలానే చూసుకుంటారు. ఆయనతో కలిసి వర్క్ చేసేటప్పుడు నేను ప్రత్యక్షంగా చూశాను. కలిసిన అందరితో బాగా మాట్లాడతారు. 'హరిహర వీరమల్లు'కు వర్క్ చేసే సమయంలో చాలా మంది నా దగ్గరకు వచ్చి 'మీరు మా దేవుడితో వర్క్ చేస్తున్నారు' అని అనేవారు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చు. ఎప్పుడూ పాజిటివ్‌గా ఉంటారు. వందశాతం కష్టపడతారు. ఎలాంటి విషయాన్నైనా ధైర్యంగా చెబుతారు. నిజాయతీగా ఉంటారు. సినిమాలతో సంబంధం లేకుండా ప్రజలు ఆయన్ని ఇష్టపడతారు. భవిష్యత్తులో ఆయన ప్రధాని అయినా ఆశ్చర్యపడను' అని నిధి అన్నారు.ఒకరిని ఉన్నతస్థానాలకు తీసుకెళ్లడానికి కాకుండా.. తొక్కేయడానికి భారీగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. నటీనటులకు కూడా ఎమోషన్స్ ఉంటాయి. నెగెటివ్ ప్రచారం వల్ల మానసికంగా కుంగిపోతారు. వాళ్లతో పాటు వాళ్ల కుటుంబాలు కూడా ఎంతో బాధను అనుభవిస్తాయని నిధి ఆవేదన వ్యక్తం చేశారు.

# షాహిద్, తృప్తి దిమ్రిల ఓ రోమియో

బాలీవుడ్ వెండితెరపై మరో క్రేజీ కాంబినేషన్ సందడి చేయబోతోంది. స్టార్ హీరో షాహిద్ కపూర్, సెన్సేషనల్ బ్యూటీ తృప్తి దిమ్రి జంటగా నటిస్తున్న భారీ యాక్షన్ రొమాంటిక్ డ్రామా 'ఓ రోమియో'. ఈ చిత్రం వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. గతంలో 'కమినే', 'హైదర్', 'రంగూన్' వంటి క్లాసిక్ చిత్రాలను అందించిన టాలెంటెడ్ డైరెక్టర్ విశాల్ భరద్వాజ్ నాలుగోసారి షాహిద్ కపూర్‌తో జతకడుతుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నిర్మాత సాజిద్ నడియాద్వాలా ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. సినిమా విడుదల తేదీ దగ్గరపడటంతో మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తాజాగా విడుదలైన ఈ సినిమా ట్రైలర్ సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ముంబై అండర్ వరల్డ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పవర్‌ఫుల్ క్రైమ్ అండ్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ముఖ్యంగా షాహిద్ కపూర్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత భయంకరమైన 'వైల్డ్' లుక్‌లో కనిపిస్తూ షాక్ ఇచ్చారు. ఒళ్లంతా టాటూలు, రక్తపు మరకలతో ఉన్న ఆయన లుక్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో తృప్తి దిమ్రితో పాటు నానా పటేకర్, అవినాష్ తివారీ, విక్రాంత్ మస్సే, దిశా పటానీ వంటి హేమాహేమీలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ఒక ప్రత్యేక పాత్రలో మెరవనుండటం సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది






# సోషల్ మీడియా విమర్శలకు దూరం

### దురంధర్ మూవీపై సారా అర్జున్

ఇటీవల సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్' విజయం ఎంతటి హాట్ టాపిక్‌గా మారిందో.. ఇందులో ప్రధాన పాత్రలో నటించిన నటీనటుల మధ్య వయసు వ్యత్యాసం కూడా అంతే వైరల్ అయ్యింది. రణ్‌వీర్ సింగ్ , సారా అర్జున్ మధ్య 20 ఏళ్ల వయసు తేడా ఉండడంతో ఈ సినిమా టీజర్ వచ్చినప్పటినుంచే విమర్శలు మొదలయ్యాయి. తాజాగా దీనిపై సారా అర్జున్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తాను ఇలాంటి విషయాలు పట్టించుకోను అని అన్నారు. ఇవన్నీ సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలే కదా.. నేను సామాజిక మాధ్యమాల్లో పెద్దగా యాక్టివ్‌గా ఉండను. అందుకే అవి నా వరకు రాలేదు. అయినా.. ఒక విషయంపై ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. 'మనం ప్రశాంతంగా ఉందాం.. పక్కవారిని ప్రశాంతంగా ఉండనిద్దాం' అనే సిద్దాంతాన్ని నేను నమ్ముతాను. పాటిస్తాను. నాకు 'ధురంధర్' కథ నచ్చింది. ఆ కథకు నేను న్యాయం చేస్తానని అనిపించింది. అందుకే ఓకే చేశా. బహుశా దీనిగురించి టీజర్ వచ్చినప్పడే మాట్లాడుకున్నారు. నేను ఆ సమయంలో అసలు ఫోన్ చూడలేదు' అని చెప్పారు. 'నేను చదువుకున్న బోర్డింగ్ స్కూల్‌లో మాకు ఫోన్ లేదు. బయటకు వచ్చిన దగ్గర నుంచి వరుస సినిమాలతో బిజీగా ఉన్నా. అందుకే సోషల్ మీడియా అలవాటు కాలేదు. ఏదైనా పోస్ట్ చేయాలనుకున్నప్పుడు చేస్తానంతే. వినోదం కోసం ఇతర మార్గాలు ఎంచుకుంటా. విరామ సమయంలో ట్రిప్‌లకు వెళు_ంటా. నేను ఒకేచోట ఎక్కువ రోజులు ఉండలేను' అని సారా అర్జున్ చెప్పారు. ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ధురంధర్' గతేడాది డిసెంబర్ 5న విడుదలై సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికీ థియేటర్లలో సందడి చేస్తోంది. ఇప్పటి వరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,283 కోట్లు వసూలు చేసింది.

# డెకాయిట్‌లో ముగిసిన మృణాల్ యాత్ర



టాలీవుడ్‌లో కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న అడివి శేష్ ప్రస్తుతం తన కెరీర్‌లో మరో కీలక దశలో ఉన్నాడు. వరుసగా విభిన్న కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తున్న శేష్, ఇప్పుడు భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న తన తాజా చిత్రం 'డెకాయిట్' తో మరోసారి బజ్ క్రియేట్ చేస్తున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని రేపుతోంది. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న మృణాల్ ఠాకూర్ తనకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తిగా ముగించుకుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటిస్తూ, సెట్స్‌లో తీసిన కొన్ని ప్రత్యేక ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. టీమ్ మొత్తం కలిసి ఉన్న ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్ ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీని క్రియేట్ చేసింది. ఇద్దరూ నటనలో మంచి అనుభవం ఉన్నవాళ్లే కావడంతో, ఈ సినిమాలో భావోద్వేగ సన్నివేశాలు బలంగా ఉండబోతున్నాయనే టాక్ వినిపిస్తోంది. ఇటీవలే ఈ హై వోల్టేజ్ డ్రామాకు సంబంధించిన కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసినట్లు సమాచారం. మృణాల్ షూటింగ్ ము-ంగియడంతో, ఇకపై సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరింత వేగంగా సాగనున్నాయి. 'సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైన మృణాల్ ఠాకూర్, ఈ చిత్రంలో ఎలాంటి పాత్రలో కనిపించబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఆమె పాత్ర కథలో కీలక మలుపులు తిప్పేలా ఉంటుందని చిత్ర వర్గాలు సూచిస్తున్నాయి. ఇదిలా ఉంటే, 'డెకాయిట్' రిలీజ్ డేట్‌పై కూడా మేకర్స్ స్పష్టత ఇచ్చారు. ఈ సినిమాను ఈ ఏడాది మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్ణయించారు. ఉగాది పండుగ సందర్భంగా థియేటర్లలోకి రానున్న ఈ చిత్రం, తెలుగు మరియు హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. పండుగ సీజన్ కావడంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్ సాధిస్తుందనే అంచనాలు ఉన్నాయి. అడివి శేష్ ఎప్పటిలాగే ఈసారి కూడా కొత్త తరహా కథను ఎంచుకున్నాడు. 'డెకాయిట్' ఒక రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. శేష్ లుక్, ప్రెజెంటేషన్ అన్నీ కొత్తగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకంగా నిలుస్తోంది. ఈ చిత్రానికి షానీల్ డియో దర్శకత్వం వహిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. అనురాగ్ కశ్యప్, కమలక్ష్మి భాస్కర్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటించడం సినిమాకు అదనపు బలాన్ని ఇస్తోంది.

# నవీన్ చంద్ర హనీ మూవీ




నవీన్ చంద్ర కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'హనీ'. ఈ సినిమాకు కరుణకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. క్షుం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. టీజర్ చూస్తుంటే.. ఈ చిత్రం నిజ జీవిత సంఘటనల ఆధారంగా, సమాజంలోని మూఢనమ్మకాలు మరియు అంధ విశ్వాసాల నేపథ్యంలో రూపొందింది. సాధారణ హారర్ సినిమాలకు భిన్నంగా, కేవలం భయపెట్టడమే కాకుండా ఒక మార్మిక ప్రపంచాన్ని ఈ టీజర్‌లో ఆవిష్కరించారు. చీకటి, నిశ్శబ్దం, మర్మమైన శక్తుల కలయికతో దర్శకుడు కరుణ కుమార్ వెన్నులో వణుకు పుట్టించే విజువల్స్‌ను వెండితెరపైకి తీసుకొస్తున్నారు. ప్రధాన పాత్రలో నవీన్ చంద్ర నటన, దివ్య పి÷-లకై, దివి, రాజా రవీంద్రల గూఢమైన పాత్రలు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తున్నాయి. అజయ్ అరసాడ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రధాన బలమని చెప్పవచ్చు. నాగేష్ బానెల్ సినిమాటోగ్రఫీ, మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటింగ్ ఈ చిత్రానికి సాంకేతిక హంగులను జోడించాయి. సైకలాజికల్ డెప్త్ మరియు సోషల్ రిలెవెన్స్ ఉన్న ఈ 'హనీ' చిత్రం ఫిబ్రవరి 6న థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | గురువారం 22 జనవరి 2026

# అంగన్వాడి కేంద్రం ఆకస్మిక తనిఖీ

### మరికల్ గ్రామ సర్పంచ్ చెన్నయ్య...



**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలోని మూడో వార్డులో గల ప్రభుత్వ అంగన్వాడి కేంద్రాన్ని మరికల్ గ్రామ సర్పంచ్ జి.చెన్నయ్య, ఉప సర్పంచ్ కటికే కాజా, 3వ వార్డు సభ్యులు సురిటి చంద్రశేఖర్ లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడి సెంటర్ లో చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అన్న ప్రసన్నం కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు అన్న ప్రసన్నాన్ని వార్డు సభ్యులు సురిటి చంద్రశేఖర్ తినబెట్టారు. ఈ కార్యక్రమంలో కార్యకర్త,ఆయా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పైప్లైన్ లీకేజీ

### పట్టించుకోని అధికారులు....

### తాగునీరు రోడ్లపై ప్రవహిస్తున్న......



**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్ ):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలోని నారాయణపేటకు వెళ్లే రహదారిలో పెట్రోల్ బంక్ ముందు ప్రభుత్వ మిషన్ భగీరథ పైప్లైన్ లీకేజీ కావడంతో తాగునీరు రోడ్లపై ప్రవహిస్తున్న అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైప్లైన్ లీకేజీలను సరిచేయాలని మరికల్ గ్రామ ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# పరీక్షకు విద్యార్థులు ఎంపిక



**నేటి సాక్షి చిలుకూరు :** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర మండల స్థాయి ప్రతిభ పరీక్షను నిర్వహించారు.ఈ ప్రతిభ పరీక్షలో ఇంగ్లీష్ మీడియం నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిలుకూరు చెందిన విద్యార్థులు బానోతు ఐశ్వర్య ప్రథమ స్థానం, బాలబోయిన శ్రీరామ్ ద్వితీయ స్థానం, అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆచార్యుల గూడెం విద్యార్థిని ముసి నవ్య శ్రీ తృతీయ స్థానం సాధించారు. తెలుగు మీడియం నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిలుకూరు కు చెందిన ఎం వెంకట గోపి ప్రథమ స్థానం, కే వర్షిత ద్వితీయ స్థానం మరియు ఎం నందిని తృతీయ స్థానం సాధించినారు, ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ కరుణాకర్ రెడ్డి , పొదిల సైదయ్య . సత్యం, ఏ లెనిన్, సిహెచ్ వెంకటేశ్వర్లు, పి వీరస్వామి, ఎం రవి, కె వెంకన్న, కె కృష్ణ, కె అశోక్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# మర్యాదపూర్వక భేటీ



**నేటి సాక్షి,కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా :**ఎస్పీ శ్రీమతి నితిక పంత్ ఐపీఎస్ ఈ రోజు జిల్లా కలెక్టర్ ఛాంబర్లో జిల్లా నూతన పాలనాధికారి శ్రీమతి కె. హరిత ఐఏఎస్ని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు, అభివృద్ధి కార్యక్రమాలపై పరస్పర సహకారంతో ముందుకు సాగాలని వారు చర్చించుకున్నారు.

# పాఠశాలలో కర్తవ్య బోద్ దివాస్



**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాలలో వివేక్ నేతాజీ జయంతోత్సవాలలో భాగంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కర్తవ్యం దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, రామచందర్ మాట్లాడుతూ విద్యార్థులు వివేకానంద నేతాజీ జీవితాలను ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను సమర్థంగా ఎదుర్కోవడంలో గొప్ప వారి జీవితం ఆదర్శంగా ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తపస్ నాయకులు,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# గంగమ్మ జాతరకు చెవిరెడ్డి సారె సమర్పణ..!

- నేతల ఇంటి ఆత్మీయ విందుకు హాజరైన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
- యువతలో ఉత్సాహం నింపిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



**నేటి సాక్షి తిరుపతి:** చంద్రగిరిమండలంలోని దోర్నకంబాల, గంగుడుపల్లి గ్రామాల్లో జరిగిన గంగమ్మ జాతరకు బుధవారం సారె సమర్పణ చేశారు. ముందుగా దోర్నకంబాల గ్రామంలో సారె సమర్పణ చేసిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆ తరువాత గంగుడుపల్లి గ్రామంలోని గంగమ్మకు సారెను సమర్పించారు.

**ఉత్సాహంగా.. ఉల్లాసంగా..**

గంగమ్మ జాతరలో భాగంగా ఆయా గ్రామాల్లోని నేతల ఇంటికి వెళ్లిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వారు ఇచ్చిన ఆత్మీయ విందు స్వీకరించారు. గ్రామంలోని యువత సెల్ఫీలు తీసుకుంటూ హడావుడి చేశారు. చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి యువకులతో సరదాగా మాట్లాడుతూ గంగమ్మ జాతర శుభాకాంక్షలు తెలుపుతూ వారిలో ఉత్సాహం నింపారు.

# గంగుడుపల్లిలో నడివీధి గంగమ్మ జాతర

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని
- గ్రామాలు సుభిక్షంగా ఉండటమే గ్రామదేవతల అభయం



**నేటి సాక్షి తిరుపతి: చంద్రగిరి:**మండలంలోని దోర్నగంబాల, గంగుడుపల్లి గ్రామ పంచాయతీలో నడివీధి గంగమ్మ తల్లి జాతర బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామస్తులందరూ ఏకమై భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకలకు చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే నానికి గంగమ్మ తల్లి కమిటీ సభ్యులు, కూటమి నాయకులు మరియు యువత ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులతో ఎదురేగి స్వాగతించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా ఎమ్మెల్యే తలపాగా చుట్టి మేల తాళాలు, డప్పు వాయిద్యాలు మధ్య టపాకాయలు కాలుస్తూ అమ్మవారికి సమర్పించే పవిత్ర 'సారె'ను ఎమ్మెల్యే తలపై పెట్టుకుని వూరేగింపుగా నడివీధి గంగమ్మ తల్లి ఆలయం వద్దకు తీసుకువచ్చారు.

**ఆధ్యాత్మిక వాతావరణంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు:**

పట్టు వస్త్రాల సారతో అమ్మవారి ఆలయానికి చేరుకుని, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం, ఎమ్మెల్యే పులివర్తి నాని గంగమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి బండారును నుదుటిన ధరించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామదేవతల కృపతోనే గ్రామాలు సుభిక్షంఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటికీ గ్రామాలు పాడిపంటలతో సుభిక్షంగా ఉన్నాయంటే అది గ్రామదేవతల అభయమే. జాతర్ల సందర్భంగా చాటింపు వేయడం, చల్ల పోయడం, నవధాన్యాల మొలకలతో పూజించడం వంటి ఆచారాలు మన సంస్కృతికి నిదర్శనం. గంగమ్మ తల్లి చల్లని చూపు దోర్నకంబాల గ్రామస్తులపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గంగమ్మ తల్లి జాతర కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమంపై శాసనసభ సమీక్ష




- ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయాలి
- శాసనసభ కమిటీ చైర్మన్ గౌరు చరితారెడ్డి

**నేటి సాక్షి తిరుపతి:** మహిళలు, పిల్లలు, వికలాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ పలు కీలక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు సక్రమంగా చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ మహిళలు, పిల్లలు, వికలాంగులు& వయోవృద్ధుల సంక్షేమ కమిటీ చైర్మన్ గౌరు చరితారెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలో మహిళలు, పిల్లలు, వికలాంగులు & వయోవృద్ధుల సంక్షేమానికి సంబంధించి అమలవుతున్న వివిధ పథకాల పురోగతిపై శాసనసభ డిప్యూటీ సెక్రటరీ ఆర్. వనితారాణి, జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్, కమిటీ సభ్యులతో కలిసి ఛైర్మన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు ఆయా శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాల వివరాలను కమిటీకి సమర్పించారు.

**మహిళల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం**

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ స్వయం సహాయక సంఘాల బలోపేతం, ఆర్థిక స్వావలంబన కార్యక్రమాలు, మహిళల భద్రత, పోషణ పథకాలు, గర్భిణీ మహిళలు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. మహిళలపై జరుగుతున్న హింసను నివారించేందుకు తీసుకుంటున్న చర్యలను మరింత ప్రభావవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

**పిల్లల హక్కుల పరిరక్షణపై దృష్టి**

పిల్లల సంక్షేమంలో భాగంగా బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల సంరక్షణ గృహాల నిర్వహణ, విద్యా–ఆరోగ్య సేవల నాణ్యతపై అధికారులతో చర్చించారు. ప్రతి బాలుడు విద్య, ఆరోగ్య సౌకర్యాలు పొందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని కమిటీ ఆదేశించింది.

**వికలాంగులు, వృద్ధులకు సమగ్ర భద్రత**

వికలాంగుల సంక్షేమానికి సంబంధించి దివ్యాంగుల పింఛన్లు, ఉపకరణాల పంపిణీ, విద్యా, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ భవనాలు దివ్యాంగులకు అనుకూలంగా ఉండేలా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృద్ధుల సంక్షేమానికి సంబంధించి వృద్ధాప్య పింఛన్లు, ఆరోగ్య సేవలు, వృద్ధాశ్రమాల నిర్వహణ, సామాజిక భద్రతా చర్యల అమలుపై అధికారులతో చర్చించారు. వృద్ధుల పట్ల గౌరవం, సంరక్షణతో కూడిన సేవలు అందేలా చర్యలు మరింత బలోపేతం చేయాలని తెలిపారు.

**పారదర్శకతతో పథకాల అమలు**

సంక్షేమ పథకాలను పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేస్తూ లబ్ధిదారులకు సకాలంలో ప్రయోజనాలు అందేలా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కమిటీ ఆదేశించింది. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత చురుకుగా నిర్వహించాలని సూచించారు.

**పాత్రికేయులతో చైర్మన్**

అనంతరం చైర్మన్ పాత్రికేయులతో మాట్లాడుతూ కమిటీ ఏర్పాటైన తర్వాత తొలి సమావేశాన్ని ఆధ్యాత్మికంగా ప్రఖ్యాతిగాంచిన తిరుపతిలో నిర్వహించడం సంతోషకరమన్నారు. తిరుపతి జిల్లాలో మహిళలు, పిల్లల సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న పథకాల తీరు సంతృప్తికరంగా ఉందన్నారు. సమావేశంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, పిల్లలు, వృద్ధుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**సమావేశంలో పాల్గొన్నవారు**

ఈ సమావేశంలో శాసనసభ కమిటీ సభ్యులు పల్లె సింధూర రెడ్డి, లోకం నాగమాధవి, వరపుల సత్యప్రభ, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీలు కావలి గ్రీష్మ రెడ్డి, కల్పలత, మధుసూదన్, డిఆర్ఓ జి. నర్సింహులు, వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి. వినోద్ కుమార్, ఐసిడిఎస్ అధికారి వసంతబాయి, సోషల్ వెల్ఫేర్ డిడి విక్రమ్ కుమార్ రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రాజా సోము, బీసీ వెల్ఫేర్ డిడి భరత్ కుమార్ రెడ్డి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి చెన్నారెడ్డి, డిఆర్డిఏ పిడి ప్రభావతి, మెప్మా పిడి ఇఫ్రామ్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చెరువు కాలువలో మట్టిని వేసి మాయం చేస్తున్నారు.

- పట్టించుకోని నారాయణపేట జిల్లా ఇరిగేషన్ అధికారులు.....
- కాలువలో మట్టిని తొలగించాలి.....



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో గల పెద్ద చెరువు కింద ఉన్న బ్రిడ్జి కాలువ ద్వారా రైతుల పంట పొలాలకు సాగునీరు అందించడం జరుగుతుంది. పంట పొలాలకు చెరువు నీళ్ళు అందకుండా అట్టి బ్రిడ్జి కాలువలో సంవత్సరానికి ఒకసారి మట్టిని వేస్తున్నారని మరికల్ గ్రామ రైతులు చర్చించుకుంటున్నారు. ఇట్టి బ్రిడ్జి భారీ బ్రిడ్జి అని రైతులు వివరించారు. ఇట్టి కాల్వలో మట్టిని వేస్తున్నారని నారాయణపేట జిల్లా ఇరిగేషన్ అధికారులకు వివరించిన పట్టించుకోవడంలేదని మరికల్ పెద్ద చెరువు కింద ఉన్న రైతులు గ్రామంలో చర్చించుకుంటున్నారు. ప్రతి సంవత్సరం బ్రిడ్జి కింద ఉన్న కాలువ మట్టిని వేసి మాయం చేస్తున్నారని రైతులు చర్చించుకుంటున్నారు. ఇకనైనా నారాయణపేట జిల్లా కలెక్టర్ స్పందించి మరికల్ పెద్ద చెరువు బ్రిడ్జి కి సంబంధించిన కాల్వ లో వేసిన మట్టిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని మరికల్ గ్రామ రైతులు కోరుతున్నారు.

# దోచుకోవటం కాదు సృష్టించి పంచటమే సుపరిపాలన



- రాష్ట్ర సంపదను ప్రజలకు సమానంగా పంచటమే ప్రభుత్వ లక్ష్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**నేటి సాక్షి । జగిత్యాల(రాధారపు నర్సయ్య):** రాష్ట్రంలోని సంపదను ప్రజలకు సమానంగా పంచటమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి-సంక్షేమం పేరుతో పదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకొని అప్పులపాలు చేసిన గత ప్రభుత్వాల విధానాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఎండగట్టారు. ఎవరికందినంత వారు దోచుకోవటమే పాలన కాదని, సంపదను సృష్టించి ప్రజలకు సమానంగా పంచటమే నిజమైన సుపరిపాలన అని స్పష్టం చేశారు.

### రూ.265 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ధర్మపురి పట్టణంలోని కళాశాల మైదానంలో బుధవారం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.265 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, అడ్లూరి లక్ష్మన్ కుమార్లతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకు ముందు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### రాష్ట్ర వనరులన్నీ ప్రజలకే

రాష్ట్రంలో ఉన్న విలువైన వనరులన్నింటినీ ప్రజలకు అంకితం చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. సంపదను సృష్టించి ప్రజలకు పంచడమే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తత్వమని, దోచుకోవటమే లక్ష్యంగా పనిచేసిన గత పాలకుల విధానాలకు ఇది పూర్తిగా భిన్నమని అన్నారు. ప్రజల కోసం సంపదను సృష్టించి, ప్రజలకే పంచడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు.

### యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

ఈ ఆలోచనల నుంచే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ రూపుదిద్దుకున్నాయని భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 25 ఎకరాల విస్తీర్ణంలో, రూ.200 కోట్ల అంచనా వ్యయంతో ఈ స్కూల్స్ నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి మేధావులను తయారు చేయడమే వీటి లక్ష్యమని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు సంపన్న వర్గాల పిల్లలతో పోటీపడే స్థాయికి ఎదుగుతారని విశ్వాసం వ్యక్తం చేశారు.

### గురుకులాల పేరుతో విభజన - ఇప్పుడు సమైక్య విద్య

గత ప్రభుత్వ హయాంలో గురుకులాల పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ విద్యార్థులను విభజించి వారి మనసుల్లో విషబీజాలు నాటారని భట్టి విమర్శించారు. ఇప్పుడు అలా కాకుండా కులమతాలకు అతీతంగా అందరూ ఒక్కచోటే చదువుకునేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇవి సామాజిక సమైక్యతకు దోహదపడతాయని అన్నారు.

### సీఎం రేవంత్ రెడ్డి దృఢ నిర్ణయం

గ్రామీణ ప్రాంతాల్లో ఇంత పెద్ద పెట్టుబడితో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అవసరమా? అనే విమర్శలు వచ్చినా సీఎం రేవంత్ రెడ్డి ఏమాత్రం వెనక్కి తగ్గలేదని భట్టి చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించి, రాష్ట్రవ్యాప్తంగా రూ.22,500 కోట్ల నిధులు కేటాయించారని వెల్లడించారు. ఈ క్రమంలోనే ధర్మపురిలో నేడు శంకుస్థాపన జరిగిందన్నారు.

### మంత్రి అడ్లూరి లక్ష్మన్‌పై ప్రశంసలు

మంత్రి అడ్లూరి లక్ష్మన్ చిన్న కార్యకర్తగా ప్రారంభమై మంత్రి స్థాయికి ఎదిగినా తన బాధ్యతను మరువలేదని భట్టి ప్రశంసించారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావడం అభినందనీయమన్నారు.

### ధర్మపురికి రికార్డు స్థాయి నిధులు

ధర్మపురి నియోజకవర్గానికి ఒకేసారి రూ.265 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేయడం ఇదే తొలిసారని భట్టి తెలిపారు. పాదయాత్ర సమయంలో పేదల కష్టాలను కళ్లారా చూసిన కారణంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు.

### డబుల్ బెడ్‌రూం పేరుతో మోసం - ఇందిరమ్మ ఇండ్లు నిజమైన భరోసా

డబుల్ బెడ్‌రూం ఇండ్ల పేరుతో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని భట్టి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి, ఇల్లు కట్టుకునే పేదలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. నిర్మాణ దశను బట్టి వారం వారం బిల్లులు చెల్లించే విధానం అమలు చేస్తున్నామని తెలిపారు.

### మహిళలు, రైతుల కోసం వేల కోట్ల ఖర్చు

ఇచ్చిన మాట తప్పకుండా మహిళలకు రూ.26,700 కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని భట్టి తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ, సబ్సిడీలు, బోనస్, యాంత్రీకరణ ద్వారా రైతుల కోసం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేశామని చెప్పారు. విద్య, వైద్య, చేనేత, విద్యుత్ రంగాలకు భారీ నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు.

### వెనక్కి తగ్గేది లేదు

అభివృద్ధి, సంక్షేమం రెండూ కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండు కళ్లని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఎన్ని విమర్శలు వచ్చినా వెనక్కి తగ్గే ప్రశ్నే లేదన్నారు. రానున్న మునిసిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు.

# రేపు చిలుకూరు మండలకి ఎమ్మార్పీఎస్

- వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ రాక

**నేటి సాక్షి చిలుకూరు:** చిలుకూరు మండలం లోని మాదిగలు ఉన్న 11 గ్రామాలలో విస్తృత పర్యటన చేస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు చిలుకూరు మండలంలోని బెతవోలు గ్రామం మరియు జెర్రిపోతుల గూడెం, ఆచార్యుల గూడెం,చెన్నారి గూడెం గ్రామాలలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జన సమీకరణ చేస్తు కర్ల రాజేష్ మరణానికి కారుకులైన ఎస్సై సురేష్ రెడ్డి, డిఎస్పి శ్రీధర్ రెడ్డి, ఎస్పీ నరసింహలను అందర్నీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ, గురువారం కర్ల రాజేష్ ర్యాలీ సభకు ముఖ్యఅతిథిగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారు ర్యాలీ సభకు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జాతీయ నాయకులు వంగూరి ఆనందరావు మాదిగ, ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి



కోటేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మల్లేపంగు సూరిబాబు మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దెల శ్రీను మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా నాయకులు మేరిగా రామారావు వంగూరి రమేష్, మేరమ్మ, నెమ్మది సరోజన, వంగూరి గురవయ్య, వంగూరి జ్యోతి, వెంకట్ నర్సమ్మ ఉప్పమ్మ మరియు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల భవిష్యత్తుకు 'మోడీ గిఫ్ట్'గా సైకిళ్లు



- కథలాపూర్ మండలంలో ఘనంగా కార్యక్రమం
- 10వ తరగతి విద్యార్థులకు స్వయంగా సైకిళ్లు అందజేసిన డా. చెన్నమనేని వికాస్

**నేటి సాక్షి - కథలాపూర్(రాధారపు నర్సయ్య ):** కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించాలనే సంకల్పంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించిన "మోడీ గిఫ్ట్" కార్యక్రమం కథలాపూర్ మండలంలో విజయవంతంగా నిర్వహించబడింది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువులో వెనుకబడకుండా ముందుకు సాగాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు నాయకులు తెలిపారు.

### ఆరు గ్రామాల 10వ తరగతి విద్యార్థులకు లబ్ధి

ఈ కార్యక్రమంలో భాగంగా తక్కల్లపల్లి, బొమ్మెన, పోతారం, అంబారిపేట, తండ్రియాల, గంభీర్పూర్ గ్రామాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్ విద్యార్థులకు స్వయంగా సైకిళ్లు అందజేశారు.

### గ్రామీణ విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన కార్యక్రమం

ఈ సందర్భంగా డాక్టర్ వికాస్.. మాట్లాడుతూ, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని విద్యార్థులు చదువులో వెనుకబడకుండా ముందుకు సాగాలన్నదే కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే సమయంలో ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా అమలు చేస్తున్నారని చెప్పారు.

### ఎన్నికలకే కాదు.. ఎప్పుడూ ప్రజలతోనే నాయకత్వం

ఎన్నికల సమయంలో మాత్రమే కాదు, ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి స్పందించే నాయకత్వం బండి సంజయ్ దని డాక్టర్ వికాస్ ప్రశంసించారు. విద్యే అభివృద్ధికి మూలమని నమ్మే భారతీయ జనతా పార్టీ, కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గాన్ని ఒక విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

### విద్యతో పాటు నైపుణ్యాల పెంపుపై దృష్టి

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకొని తమ కుటుంబాలకు, సమాజానికి గర్వకారణంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. మద్యం, మత్తు పదార్థాలకు బానిసవకుండా క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. విద్యతో పాటు నైపుణ్యాలను కూడా పెంపొందించుకుంటే జీవితంలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని హితవు పలికారు. ఈ కార్యక్రమంలోమండల అధ్యక్షుడు మల్యాల మారుతి,జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వరరావు,కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి,మాజీ మండల అధ్యక్షుడు కంటే సత్యనారాయణ,బద్రి సత్యం, వినోద్ రెడ్డి, గాంధారి శ్రీనివాస్, రాచమడుగు శ్రీనివాసరావు, ధర్మపురి జలంధర్, గడిల గంగాప్రసాద్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం కప్ క్రీడోత్సవాలు



**నేటి సాక్షి చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిధిలోని పాలే అన్నారం,నారాయణపురం చిలుకూరు మండల కేంద్రంలో నందు సీఎం కప్ 2025 నిర్వహణలో భాగంగా నారాయణపురం గ్రామంలో గ్రామస్థాయి క్రీడోత్సవాలు నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుజ్జుల నరసింహారెడ్డి . అధ్యక్షతన నిర్వహించిన ఈ క్రీడలను గ్రామ సర్పంచ్ మండవ జయమ్మ క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మండవ వెంకటేశ్వరరావు.గ, మాజీ జెడ్పిటిసి జాన్మియా వార్డు సభ్యులు,పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు అనంతరెడ్డి, బీవీఎల్ ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి ,వీరబాబు, వీరస్వామి, శాంత కుమారి, కాశీనాథ్ సుధాకర్ రెడ్డి, జగన్మోహన్, నరసింహారావు, మల్లేశ్వరరావు,స్వరూప విరూపాక్ష, ఆసిఫ్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని నారాయణపురం క్లస్టర్ ఇంచార్జ్ పాఠశాల పిడి సీతారాంరెడ్డి తెలిపారు.

## దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శన

### 210 నూతన ఆవిష్కరణలు పరిశీలించిన ఉపాధ్యాయులు......



**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్):** విషయ పరిజ్ఞానం విస్తృత పర్చుకోవడం తో పాటు విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణ ఆలోచనలు పెంపొందించే నిమిత్తం నారాయణ పేట జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు ఆదేశాల మేరకు ఎంపిక చేసిన ఉపాధ్యాయ బృందం దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శనను బుధవారం సందర్శించి నట్లు జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా కొల్లూర్ లోగల గాడియం పాఠశాలలో జరుగుతున్న వైజ్ఞానిక ప్రదర్శన ను వారు తిలకించారు. జీవశాస్త్ర విభాగంనుండి ఉపాధ్యాయులు వార్ల మల్లేశం, సంతోష్, అనిల్ నాయక్, భౌతిక శాస్త్ర విభాగం నుండి రామ్మోహన్, తిరుపతి నాయక్, సంజీవరెడ్డి, గణిత శాస్త్ర విభాగం నుండిభాను, ఫజుల్ రెహమాన్ విజయ్ పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి,కర్ణాటక, తో కలిపి మొత్తం ఆరు రాష్ట్రాల నుండి ఎంపికైన 210 నూతన ఆవిష్కరణలను వారు ఈ సందర్భంగా తిలకించారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన మరో 40 స్టాల్స్ లో ఏర్పాటుచేసిన పలు అంశాలను పరిశీలించారు.

## రాజనాల హుండీ ఆదాయం




**నేటి సాక్షిన్యూస్ చౌడేపల్లి:** సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండ ప్రసన్న ఆంజనేయస్వామి శ్రీ లక్ష్మీనరసింహస్వామి, ఆలయంలోని హుండీ ద్వారా రూ 57,935లు ఆదాయంగా వచ్చినట్లు టెంపుల్ ఇన్స్పెక్టర్ భాను ప్రకాష్ తెలిపారు, బుధవారం గత 4నెలలకు గాను హుండీ లెక్కింపు నిర్వహించారు. ఇందులో భాగంగా నగదును భక్తులు స్వామి వార్లకు సమర్పించినట్లు ఆయన వివరించారు, ఈ కార్యక్రమంలో టిటిడి పరకామణి సిబ్బంది పాల్గొన్నారు

## మార్కండేయ జయంతి ఉత్సవాలు



**రాయికల్- నేటి సాక్షి ( ఇమ్మడి విజయ్ కుమార్ ) :** మార్కండేయ జయంతి సందర్భంగా పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో శివ భక్త మార్కండేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి గణపవరపు మల్లికార్జున శర్మ మార్కండేయ మహర్షికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కండేయ మహర్షి యొక్క జన్మ వృత్తాంతాన్ని వివరించి వారి అద్భుతమైన లీలలను భక్తులకు కథా రూపంలో తెలియజేశారు. పూజానంతరం భక్తులందరికీ ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు బోగ రాజేశం, ఉపాధ్యక్షులు దాసరి గంగాధర్, కార్యదర్శి కడుకుంట్ల నరేష్, కోశాధికారి ఆడెపు నర్సయ్య, యువజన సంఘం అధ్యక్షులు సామల్ల సతీష్, ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజీవ్, సహాయ కార్యదర్శులు అనుమల్ల చంద్ర తేజ, గంట్యాల ప్రవీణ్, తాటిపాలు విశ్వనాథం, అష్టమ వాడ పెద్దలు, గూడూరి పొట్టన్న, కట్టేకోల భాస్కర్, శ్రీను, వాసం నర్సయ్య, మాచర్ల మారుతి, మాజీ పదాదీ కారులు మామిడాల లక్ష్మీనారాయణ, కడకుంట్ల ప్రభాకర్, అనుమల్ల రమణ, పద్మశాలి కులబంధావులందరు పాల్గొన్నారు.

## సర్పంచ్‌కు సన్మానం



**నేటి సాక్షి,గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలం లోని మాదాపూర్ సర్పంచ్ మాదరి శ్రీనివాస్ ని సన్మానించిన బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ కుమార్ ఈ సందర్భంగా బ్రిడ్జి చేసి చైర్మన్ మాట్లాడుతూ అన్ని గ్రామాలకు అవసరమైన సౌకర్యవంతమైన మైసమ్మ గుట్ట నుండి కరీంనగర్ వరకు బ్రిడ్జి నిర్మించుట కొరకు గ్రామ ప్రజలందరినీ ఏకతాటిపై తీసుకురావాలని కోరారు మరియు బ్రిడ్జి యొక్క ఆవశ్యతను గ్రామ ప్రజల అవసరాల దృష్ట్యా మూడు మండలాల ప్రజల ఆకాంక్ష నెరవేర్చే విధంగా ప్రజాప్రతినిధులతో మాట్లాడి సమన్వయ పరచాలని కోరారు ఈ కార్యక్రమంలో నూనె చంద్ర రెడ్డి గొడుగు చంద్రయ్య మరియు గ్రామస్తులు పాల్గొన్నారు...

## మూఢనమ్మకాలను నమ్మొద్దు



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** మూఢనమ్మకాలను విడిచి శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచుకోవాలని ఎంఈఓ కేశవరెడ్డి అన్నారు. మండలంలోని పంచాయతీ కేంద్రం కాకతీలో ఇటీవల క్షుద్ర పూజల కలకలం పై ఆయన విద్యార్థులు గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ పాతకాలంలో వైజ్ఞానిక శాస్త్రం అభివృద్ధి చెందకపోవడం వల్ల ప్రజల్లో అనేక మూఢనమ్మకాలు ఉన్నాయని మంత్రాలు తంత్రాలు చేతబడి .దయ్యాలు భూతాలు లాంటి మూఢనమ్మకాలు ఉండేవన్నారు. కానీ ఇప్పుడు వైజ్ఞానిక శాస్త్రం అభివృద్ధి చెందడం వల్ల అవన్నీ తప్పని తెలిసిందన్నారు ప్రజలు అందరూ మూఢనమ్మకాలను నమ్మరాదని ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే వైద్యశాలకు వెళ్లి వైద్యులను సంప్రదించాలని కోరారు ,అంతేకానీ క్షుద్ర పూజలు చేస్తే ఫలితం ఉండదు క్షుద్ర పూజలు వల్ల ఇతరులను ఇబ్బంది. పెట్టాలనుకోవడం అప్రజా ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామోదరం .ఉపాధ్యాయులు శ్రీధర్ ఏవి సుబ్రహ్మణ్యం .శ్రీలత ప్రసన్నకుమారి .పూర్ణిమ విద్యార్థులు వారి తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు,

## ప్రగతిలో క్రీడలు ప్రారంభం



**రాయికల్ ,నేటి సాక్షి (ఇమ్మడి విజయ్ కుమార్) :** రాయికల్ పట్టణంలోని ప్రగతి హై స్కూల్ లో ఘణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు క్రీడలను ప్రిన్సిపాల్ బాలె శేఖర్ పాల్గొని జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "క్రీడలు కేవలం పతకాలు గెలవడం లేదా బహుమతులు పొందడానికే పరిమితం కావని. అవి విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సహనం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు గెలిచినా, ఓడినా నిజమైన విజయం వారి ప్రయత్నం, నిబద్ధత, స్పోర్ట్స్‌మాన్ స్పిరిట్‌లోనే ఉందని స్పష్టం చేశారు. ఈ రోజు మీరు నేర్చుకునే పాఠాలే రేపు మిమ్మల్ని విజేతలుగా నిలబెడతాయని పేర్కొన్నారు. తమ శక్తిపై నమ్మకం, లక్ష్యంపై దృష్టి ఉంటే ఏ సవాలునైనా అధిగమించవచ్చని ఆయన విద్యార్థులకు ధైర్యం చెప్పారు. చివరగా విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, తమ ప్రతిభను మరియు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బాలె జయశ్రీ శేఖర్, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయ బృందం,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆలయం కమిటీ



**రాయికల్- నేటిసాక్షి (ఇమ్మడి విజయ్ కుమార్):** మండలం లోని తాట్లావాయి గ్రామంలో గల శ్రీ సీతారామ ఆలయం నూతన కమిటీని ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు. దీనిలో చైర్మన్ గా కోసరి మహేష్, వైస్ చైర్మన్ గా లావుడ్యా నందు, క్యాషియర్ గా బలుసు రంజిత్, కోశాధికారిగా కుర్ర సుధాకర్, కార్యవర్గ సభ్యుడిగా కొండవేని శేఖర్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

## టిక్కెట్ కేటాయించాలని వినతి



**నేటి సాక్షి, కరీంనగర్:** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున టిక్కెట్‌ను కేటాయించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్ డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు విన్నవించారు. ఈ మేరకు బుధవారం ఆయన కరీంనగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి 45వ డివిజన్ టిక్కెట్‌ను కేటాయించాలని కోరారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న తనకు అవకాశం కల్పించాలన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్:** నియోజకవర్గం కేరమేరి మండల కేంద్రంలోని వీూణా కార్యాలయంలో ఈరోజు గౌరవ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే శ్రీమతి కోవ లక్ష్మి గారు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు 'కళ్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాల కింద చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ఈ పథకాలు లబ్ధిదారులకు ఎంతో ఉపయోగకరంగా మారాయని తెలిపారు. ప్రతి అర్హుడైన లబ్ధిదారుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దీ=నా కేరమేరి మండల అధ్యక్షులు రాథోడ్ అంబాజీ, కేరమేరి సర్పంచ్ ఆనంద్ రావు, నిషాని సర్పంచ్ అంబారావు, మెట్ట పిప్పిరి సర్పంచ్ కొద్దు, అగర్వాడ సర్పంచ్ రోజా, ఇందాపూర్ సర్పంచ్ బుచ్చయ్య, మాజీ ఎంపీపీ మోతిరామ్, మాజీ వైస్ ఎంపీపీ కలాం, మాజీ ఎంపీటీసీ ఇఫ్తెకర్, యునుస్, రూపులాల్, కంబాల వినేష్, నిషార్, పెందొర్



శ్రీనివాస్ తదితర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ ఎర్ర మట్టి మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి



- మండలంలో రైతులకు రక్షణ కల్పించాలి - సీపీఎం డిమాండ్

**నేటి సాక్షి, వికారాబాద్:** వికారాబాద్ మండల పరిధిలోని గ్రామాలు, మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా సాగుతున్న ఎర్ర మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వికారాబాద్ ఆర్డీవో, తహసిల్దార్‌లకు సీపీఎం ఆధ్వర్యంలో మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్ మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతుల పొలాలు, గుట్టలను ధ్వంసం చేస్తూ అక్రమార్కులు ఎర్ర మట్టి తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. దీనిని ప్రశ్నించిన రైతులు, గ్రామస్తులను బెదిరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. అక్రమ మైనింగ్ వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, వెంటనే వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అక్రమ ఎర్ర మట్టి మైనింగ్ మాఫియాను అరికట్టాలని అనేకసార్లు జిల్లా, మండల అధికారులకు ఫిర్యాదు చేసినా కంటి తుడుపు చర్యలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. రాత్రి వేళల్లో జేసీబీలు, టిప్పర్లు, లారీలతో ఎర్ర మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఫోటోలు, ఆధారాలు సమర్పించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మైనింగ్ అధికారులు, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించి అక్రమ ఎర్ర మట్టి తవ్వకాలను నిలిపివేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. ప్రభుత్వ భూములను కాపాడడంతో పాటు రైతులు, గ్రామస్తులకు భద్రత కల్పించాలని కోరింది. అక్రమ మైనింగ్‌పై తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఆయా గ్రామాల రైతులు, ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేపడతామని ప్రభుత్వాన్ని, అధికారులను సీపీఎం హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు, డివిజన్ కార్యదర్శి సతీష్ కుమార్, నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లెనిన్ వర్ధంతి

- ప్రపంచ కార్మిక వర్గ శ్వాస కామ్రేడ్ లెనిన్
- చింతకింది కుమారస్వామి సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు.



**నేటి సాక్షి, నల్లబెల్లి :** పెట్టుబడి దారీ సమాజానికి ప్రత్యామ్నాయంగా మార్క్సిజం సిద్ధాంతాన్ని అన్వయించి, అక్టోబర్ 17 న విప్లవం ద్వారా రాచరిక జార్ చక్రవర్తి పాలనను కూలదోసి కార్మిక కర్షక రాజ్యాన్ని నిర్మించిన విప్లవం ప్రధాత కామ్రేడ్ లెనిన్ అనీ కుమారస్వామి అన్నారు. మండల కేంద్రమైన నల్లబెల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో సిపిఐ ఆధ్వర్యంలో లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. లెనిన్ మరణించి 102 ఏండ్లు అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఆలిన దేశాల్లో సంక్షేమ రాజ్యాలు అవతరించడానికి లెనినిజమే ప్రధాన కారణమన్నారు. లెనిన్ స్థాపించిన సోషలిస్టు సోవియట్ యూనియన్ ఉండటం వల్లనే సామ్రాజ్యవాదం వెర్రి తలలు వేయకుండా ప్రపంచాన్ని కాపాడి రెండవ ప్రపంచయుద్ధం లో విజయం సాధించడానికి కారణం లెనినిజమే ప్రధాన భూమిక వహించందన్నారు.. స్వాతంత్ర్యం అనంతరం నుంచి నేటికీ భారతదేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎదగడానికి, సంక్షేమ సామ్యవాద రాజ్యంగా నిలబడటానికి లెనినిజమే కారణమన్నారు. దోపిడీ లేని వర్గ రహిత ప్రపంచం కోసం తపనపడ్డ లెనిన్ ఆశయాలను భారతదేశ యువతరం స్ఫూర్తిగా తీసుకొని కమ్యూనిస్టులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పరికి రత్నం, మనుగొండ ప్రసాద్, కనుక రవి చందర్, మహమ్మద్ హైమద్, కోలా లింగయ్య,కొండి అశోక్,గుండెబోయిన ఐలయ్య,లింగయ్య,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆటల్లో సామర్థ్య పెంపొందించాలి



- నోడల్ ఆఫీసర్ కోమ్మిడి లక్ష్మన్న

**రాయికల్-నేటి సాక్షి (ఇమ్మడి విజయ్ కుమార్):** విద్యార్థుల్లో చదువు తో పాటు ఆటల్లో సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా తనిఖీ బృందం నోడల్ ఆఫీసర్ కోమ్మిడి లక్ష్మన్న సూచించారు.బుధవారం రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు ,బాలికలు ,ఉర్దూ మీడియం పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను జిల్లా ప్యానల్ తనిఖీ బృందం బుధవారం పరిశీలించింది. తనిఖీలో భాగంగా పాఠశాలలోని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు రికార్డుల నిర్వహణ మార్కుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయడం తరగతి గదిలో బోధన విధానం తదితర అంశాలను వారు పరిశీలించి. తగిన సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆటలు ఆడించారు. విద్యార్థులు వివిధ రకాల ఆటలు ఆడునట్లు ప్రోత్సాహం ఇవ్వాలని వారిలో క్రీడా సామర్థ్యాల పెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తనిఖీ బృంద సభ్యులు లక్ష్మీరాం నాయక్ , శ్రీనివాసరావు, దాసరి రామస్వామి, ధర్మేందర్, టి.శ్రీనివాస్, శ్రీధర్, రవీందర్, సంయుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కాపు శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు పి.గంగాధర్, పి. రమేష్ ఉపాధ్యాయులు పి.రాజశేఖర్ చెరుకు మహేశ్వరశర్మ, రాజమహ్మద్,ఎ.పద్మజి.తరంగిణి,ఎ.రజిత.యస్.శోభ, రాజమహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాల విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ



**నేటి సాక్షి । తిరుపతి:** విజయవాడ నగరంలోని హనుమాన్‌పేటలో ఉన్న ఒక ప్రైవేట్ హోటల్‌లో బుధవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డివిఎంసి) సభ్యుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, వారి అభివృద్ధి, విద్యార్థుల హక్కులు, పౌరహక్కుల పరిరక్షణ అంశాలపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం పనిచేయాలని కార్యవర్గ సభ్యులు తీర్మానించారు. ఈ సమావేశం సందర్భంగా రాష్ట్రంలోని జిల్లాల డివిఎంసి సభ్యులతో కూడిన నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. నూతనంగా రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల డివిఎంసి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ ప్రజల సమస్యలపై డివిఎంసి సభ్యులతో సమన్వయం చేసుకుంటూ, వారి అభివృద్ధి, హక్కుల పరిరక్షణకు తన వంతు బాధ్యతగా నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

### నూతన రాష్ట్ర కార్యవర్గం వివరాలు

గౌరవ అధ్యక్షులు : అరవ పార్వతయ్య (తిరుపతి జిల్లా)
రాష్ట్ర అధ్యక్షులు : పాలకుంట శ్రీనివాసులు (అన్నమయ్య జిల్లా)
రాష్ట్ర ఉపాధ్యక్షులు : ములకపల్లి రాజు (అనకాపల్లి జిల్లా) నెర్రిమెట్ల యల్లన్న (అనంతపురం జిల్లా)
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి : వలతూర్ రాజ్ కుమార్ (చిత్తూరు జిల్లా)
రాష్ట్ర కార్యదర్శి : బాణావతి మునేంద్ర నాయక్ (చిత్తూరు జిల్లా)
రాష్ట్ర అధికార ప్రతినిధులు : బండ కింద మనోహర్ (అన్నమయ్య జిల్లా) రెడ్డి రమణమ్మ (గుంటూరు జిల్లా)
రాష్ట్ర ప్రచార కార్యదర్శి : కృష్ణమూర్తి (సత్యసాయి జిల్లా)
రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు : యానమగ్గి వెంకటేశ్వర్లు వేము భగవాన్ దాస్ (బాపట్ల జిల్లా)
రాష్ట్ర కోశాధికారి : తాతపూడి జయశ్రీ
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు : కె. సరోజినీ (విశాఖపట్నం జిల్లా) పల్లె మణిందర్ దేవ్ (ప్రకాశం జిల్లా) జి. మాలతి (కర్నూలు జిల్లా) మంద రవికాంత్ (పల్నాడు జిల్లా) ఇసుకల సాయి ప్రసాద్ (నెల్లూరు జిల్లా) బి. అప్పారావు (అనకాపల్లి జిల్లా)

# బ్లాక్ స్పాట్‌ల వద్ద పోలీస్ స్టాపర్స్ ఏర్పాటు







- 'అరైవ్ - అలైవ్' కార్యక్రమంతో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన
- గ్రామస్తులు, వాహనదారులతో మాట్లాడిన కోరుట్ల పోలీసులు

**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య )** రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో పోలీస్ శాఖ చేపట్టిన 'అరైవ్–అలైవ్' కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పట్టణ పరిధిలో బుధవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. కోరుట్ల సీఐ బి. సురేష్ బాబుతో కలిసి ఎస్.ఐ. కోరుట్ల ఆధ్వర్యంలో ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పరిధిలోని మోహన్ రావు పేట్, వెంకటాపూర్ ఎక్స్ రోడ్, అలాగే రాఖీ స్కూల్ పరిసరాలు వంటి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్‌ల వద్ద రోడ్డుపైన పోలీస్ స్టాపర్స్‌ను ఏర్పాటు చేశారు. వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడి గ్రామస్తులు, వాహనదారులతో పోలీసులు నేరుగా మాట్లాడారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల జరుగుతున్న ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించడం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని స్పష్టంగా సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో పోలీసు శాఖ ఒక్కటే కృషి చేస్తే సరిపోదని, ప్రజల సహకారం అత్యంత అవసరమని సీఐ సురేష్ బాబు తెలిపారు. పోలీసు వారు అందిస్తున్న సలహాలు, సూచనలను తప్పక పాటిస్తూ, రోడ్డు భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్రజల ప్రాణ భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. 'అరైవ్–అలైవ్' కార్యక్రమం ద్వారా ప్రమాద రహిత కోరుట్లను లక్ష్యంగా పెట్టుకొని ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని సిఐ సురేష్ బాబు, ఎస్ఐ చిరంజీవిలు తెలిపారు. ప్రజలు సహకరిస్తేనే రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నియంత్రించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు.

# బొమ్మెనలో అర్ధరాత్రి దొంగల బీభత్సం

- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్





**నేటి సాక్షి - కథలాపూర్(రాధారపు నర్సయ్య ):** కథలాపూర్ మండలంలోని బొమ్మెన గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామానికి చెందిన బాలె లాస్య, బాలె కళావతి, బాలె లలిత కుటుంబాల వారు ఇతర పనుల నిమిత్తం మరో గ్రామానికి వెళ్లగా, ఇళ్లు తాళాలు వేసి ఉన్నట్లు గమనించిన దొంగలు ఇదే అదునుగా భావించి వారి ఇళ్ల తాళాలను పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ ఘటనతో గ్రామంలో కలకలం రేగింది. దొంగతనంలో భాగంగా బాలె లాస్య ఇంటిలో ఉన్న మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, మూడు తులాల వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. మిగతా రెండు ఇళ్లలోనూ ఇంటి సామగ్రిని చిందరవందరగా వేసి విలువైన వస్తువుల కోసం గాలించినట్లు సమాచారం. ఇంటి యజమానులు తిరిగి వచ్చి తాళాలు పగిలి ఉండటాన్ని గమనించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన చేపట్టారు. దొంగల ఆచూకీ కోసం దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. వరుసగా మూడు ఇళ్లలో దొంగతనం జరగడంతో బొమ్మెన గ్రామంలో భయాందోళన వాతావరణం నెలకొంది. రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి గా వుండాలి



- కాంగ్రెస్ సీనియర్ నాయకులు పంది రాజు

**నేటి సాక్షి తొగుట:** మండలంలోని వెంకటరావుపేట గ్రామంలో తెలంగాణ కేసరి క్యాలెండర్ ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు పంది రాజు ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిజం సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా వుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ఓలపు నారాయణ,మండల ఉపాధ్యక్షులు బెజ్జనబోయిన అనిల్, ఆత్మ కమిటీ డైరెక్టర్ ప్రవీణ్, వార్డు సభ్యులు కల్లేపు భాను,రిపోర్టర్ వడ్డే నందు నాయకులు కళ్ళేపు నరేష్,గంగోళ్ల ప్రశాంత్, సుతారి ఆంజనేయులు,వడ్డే శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# భక్త మార్కండేయ జయంతి



**నేటి సాక్షి రాయికల్ ( ఇమ్మడి విజయ్ కుమార్ ):** శ్రీ భక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలను బుధవారం పద్మశాలి యువ నేత సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు భోగరాజు మాట్లాడుతూ బ్రహ్మ తన నుదుటిన 16 సంవత్సరాల ఆయుష్షు ఇచ్చినప్పటికి తను శివారాధన, భక్తి శ్రద్ధలతో నియమ నిష్ఠలతో గురువుల పట్ల వినయ విధేయలతో యమధర్మరాజుని ఎదురించి చిరంజీవిగా నిలిచాడు. మార్కండేయ పురాణం రాసి నేడు మానవజాతికి ఆదర్శ ప్రాయుడయ్యాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నేత సంగం ఉపాధ్యక్షులు సామల్ల మహేష్, కోశాధికారి ఆడెపు రాజు, పద్మశాలి సేవ సంఘం ఉపాధ్యక్షులు ఆడెపు రాము, దాసరి నవీన్ భోగా రాజ్ కుమార్ తాళ్ల అంజయ్య స్వర్గం నితిన్ భోగ రాకేష్ సంపత్ పవన్ రాజేశం కార్యవర్గ సభ్యులు, పద్మశాలి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కథలాపూర్ ఎస్ఐగా రవి కిరణ్



**నేటి సాక్షి - కథలాపూర్(రాధారపు నర్సయ్య ):** కథలాపూర్ మండలం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా సిహెచ్.రవి కిరణ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై రవి కిరణ్ మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐ కి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ ఇదివరకు పని చేసిన ఎస్ఐ నవీన్ కుమార్ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు బదిలీపై వెళ్లారు.

# విస్డం విద్యార్థుల ప్రతిభ



**నేటి సాక్షి రాయికల్ ( ఇమ్మడి విజయ్ కుమార్ ) :** చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ తరఫున ప్రజ్ఞా వికాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు బుధవారం ముచింతల్ లోని జీవా ప్రాంగణంలో సర్టిఫికెట్లు బహుమతులు ప్రధానం చేశారు. వ్యాసరచన పోటీలో ఎద్దండి రుప్య రెడ్డి జిల్లా స్థాయి మొదటి బహుమతి పొందగా, ఉపన్యాస పోటీలో పోతుగంటి శ్రీ తేజ మొదటి బహుమతి సాధించింది. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వామి వారు సర్టిఫికెట్లు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను ప్రజ్ఞా వికాస్ రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు విస్డం హైస్కూల్ కరస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి డైరెక్టర్ నివేదితారెడ్డి ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు.

# విజయమే లక్ష్యంగా కృషిచేయాలి



**నేటిసాక్షి, కరీంనగర్:** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కృషిచేయాలని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ సూచించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ నాయకులతో సిద్దిపేటలో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం పాటు పడాలన్నారు. కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అంజన్ కుమార్, నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు, ఆర్టీఏ సభ్యులు పడాల రాహుల్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎమ్మెల్యే



**నేటి సాక్షి జగిత్యాల(ఇమ్మడి విజయ్ కుమార్):** జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామంలో దాతల సహకారంతో గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ప్రారంభించా. అనంతరం దాతలను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నక్కల రవీందర్ రెడ్డి,బాల ముకుందం, సర్పంచ్ ఉప సర్పంచ్ లు రెడ్డి రత్న,గుంటీ రవి,పోరండ్ల సర్పంచ్ ఉప సర్పంచ్ నక్క హరీష్, మల్లేశం గౌడ్, మాజీ ఉపసర్పంచ్ గంగారెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి రవీందర్ రెడ్డి,కడ మహేష్,సత్యనారాయణ, కొండ శ్రీనివాస్, నారాయణ, తోట గంగరాజం, శశి కుమార్, గ్రామ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పై అవగాహన



**నేటి సాక్షి జగిత్యాల (ఇమ్మడి విజయ్ కుమార్):** జగిత్యాల పట్టణంలో బుధవారం అరేవ్ అలెవ్ కార్యక్రమాన్ని శ్రీ చైతన్య విద్యార్థులచే పట్టణ పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేతవాహన దారులకు ట్రాఫిక్ పై అవగాహన నిర్వహించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించిన వారికి ప్రశంస పూర్వకంగా... అలాగే ధరించని వారికి హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలి అని తెలియజేస్తూ గులాబీ పుష్పాలను అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్సై సుప్రియ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీట్‌బెల్ట్ హెల్మెట్ ధరించాలని అన్నారు.. విద్యార్థుల చేత ఈ కార్యక్రమం నిర్వహించడం వలన వారికి ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కలుగుతుందని అన్నారు.. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు కూడా వాహనం నడుపుతున్నప్పుడు హెల్మెట్ ధరించేలా చేయాలని అన్నారు. అనంతరం శ్రీ చైతన్య విద్యార్థులను ప్రశంసించారు.

# భవనాల నిర్మాణాలకి నిధులు మంజూరు

**1కోటి 50 లక్షల రూపాయలు**

**మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారి**

**నేటి సాక్షి-మేడిపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్రంలోని మహిళా సాధికారతకు పెద్దపేట వేస్తున్నారని వేములవాడ శాసనసభ్యులు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అన్నారు బుధవారం మేడిపల్లి మండలంలోని 6 గ్రామాలు భీమారం మండల పరిధిలోని 9గ్రామాలు ఉమ్మడి మండల పరిధిలో 15 మహిళా సంఘాల భవనాలకు ఒక్కో సంఘానికి 10 లక్షల చొప్పున నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు.

# క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



**నేటి సాక్షి జగిత్యాల ( ఇమ్మడి విజయ్ కుమార్):** జనవరి 27 నుండి కర్ణాటకలోని మైసూర్ నగరంలో నిర్వహించే అంతర్ విశ్వవిద్యాలయ క్రికెట్ పోటీలకు, శాతవాహన యూనివర్సిటీ జట్టులో స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు చెట్టే మనోజ్ . బీకాం..తపాలా హరీష్ బిఎస్సి ఎన్నికై శాతవాహన యూనివర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇటీవల నిర్వహించిన యూనివర్సిటీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్లో వీరిద్దరూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కళాశాల జట్టును ద్వితీయ స్థానంలో నిలిపినారు. అదేవిధంగా గత రెండు సంవత్సరాలుగా ఇరువురు విద్యార్థులు వరుసగా జాతీయస్థాయి పోటీలకు ఎన్నికవ్వడం గమనార్హం. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ, డైరెక్టర్ పల్లెర్ల నరేష్, ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, ఫిజికల్ డైరెక్టర్ సాయిచంద్ మరియు సిబ్బంది అభినందించారు.

# డాక్టర్ శ్రీదేవి రెడ్డి ఆకస్మిక మృతి

**వెంకటరెడ్డితో పాటు కుటుంబీకులకు పరామర్శ**

**ఆమె చిత్రపటానికి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నివాళులు**



**నేటి సాక్షి తిరుపతి, చంద్రగిరి:** తన వైద్యవృత్తి ద్వారా ఎంతో మందికి ప్రాణదానం చేసిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజీ సర్జన్ డాక్టర్ శ్రీదేవిరెడ్డి ఆకస్మిక మరణం సమాజానికి తీరనిలోటని తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. ఈనెల 17వ తేదీన ఆకస్మిక మరణం చెందిన ఆమె అంత్యక్రియలను చంద్రగిరి మండలం ఐతేపల్లి వద్దనున్న ఫాంహౌస్ లో నిర్వహించారు. తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి బుధవారం అక్కడకు చేరుకుని శ్రీదేవిరెడ్డి భర్త వెంకటరెడ్డితో పాటు ఆమె కుమార్తె, కుమారుడు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆమె చిత్రపటానికి నమస్కరించి నివాళులు అర్పించారు. శ్రీదేవిరెడ్డి మరణం ఆ కుటుంబానికే కాకుండా సమాజానికి తీరనిలోటన్నారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి సోదరుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డిలు కూడా వున్నారు.

# కాచారంకి సబ్ స్టేషన్ మంజూరు

**నేటి సాక్షి-మేడిపల్లి:** మేడిపల్లి మండలంలోని కాచారం గ్రామానికి 2 కోట్ల 90 లక్షలతో సబ్ స్టేషన్ మంజూరు చేస్తూప్రభుత్వం ఉత్తర్వులుజారీ చేసింది.రాష్ట్ర ప్రభుత్వవిప్ఆదిశ్రీనివాస్ కృషితో గత కొన్ని రోజులుగా కాచారం గ్రామ రైతులు గ్రామస్తులు ఎదురు చూస్తున్న సబ్ స్టేషన్ మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సబ్ స్టేషన్ ఏర్పాటు వల్ల రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు.ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, లకు ధన్యవాదాలు తెలిపారు.

# స్వామివారిని దర్శించుకున్న

**మాజీ సర్పంచ్ మూల సుమలత శ్రీనివాస్ గౌడ్**



**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి:( గుండ ప్రశాంత్ గౌడ్ )** జగిత్యాల జిల్లా శ్రీ భక్త మార్కండేయ జయంతి సందర్భంగా బుగ్గారం మండలంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ సర్పంచ్ మండల పోరం అధ్యక్షులు మూల సుమలత శ్రీనివాస్ గౌడ్ ఆలయ కమిటీ పెద్దలు సన్మానించారు

# రావులపల్లి కలాన్‌లో గృహ జ్యోతి పథకం పంపిణీ



- సర్పంచ్ వానరసి సువర్ణ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం
- ఉపసర్పంచ్ బొజ్జ సరిత వెంకట్ రెడ్డి, వార్డు సభ్యుల పాల్గొనడం
- గ్రామ పెద్దల సమక్షంలో లబ్ధిదారులకు పథకం అందజేత

**రంగారెడ్డి జిల్లా నేటి సాక్షి సుధాకర్ గౌడ్ :**రంగారెడ్డి జిల్లా, శంకర్‌పల్లి మండలం, రావులపల్లి కలాన్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక గృహ జ్యోతి పథకంను గ్రామ సర్పంచ్ వానరసి సువర్ణ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమం గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొజ్జ సరిత వెంకట్ రెడ్డి ప్రత్యేకంగా పాల్గొని మాట్లాడారు. గృహ జ్యోతి పథకం ద్వారా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు విద్యుత్ ఖర్చుల భారం తగ్గుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యమని ఆమె తెలిపారు. గ్రామంలోని వివిధ వార్డ్ నెంబర్లకు చెందిన వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. లబ్ధిదారులు ప్రభుత్వానికి, గ్రామ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వానరసి సువర్ణ కృష్ణమూర్తి మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# చోరీకి యత్నించిన దుండగులు

- ప్రభుత్వ ఉద్యోగి మెడలోని బంగారు గొలుసుపై దాడి

నేటి సాక్షి – మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణంలో దుండగుల ఆగడాలు కలకలం రేపుతున్నాయి. పట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయం సమీపంలో ప్రభుత్వ ఉద్యోగి మెడలో నుంచి బంగారు గొలుసు చోరీకి యత్నించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఇరిగేషన్ శాఖలో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న కల్లోల అభినయ్ కార్యాలయం పక్కన నిల్చొని ఉండగా, ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అకస్మాత్తుగా ఆయన మెడలోని బంగారు గొలుసును లాక్కోవడానికి ప్రయత్నించారు.అభినయ్ అప్రమత్తంగా చేయి అడ్డుపెట్టడంతో దుండగులు గొలుసు ఎత్తుకెళ్లలేకపోయారు. ఈ క్రమంలో ఆయన చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కోడానికి ప్రయత్నించగా, ఫోన్ కిందపడిపోయింది. దీంతో భయపడిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు.ఘటనపై సమాచారం అందుకున్న మెట్పల్లి ఎస్సై కిరణ్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలో సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలు



- గ్రామాభివృద్ధి అంటే తల్లికి సేవ చేసినట్లే
- మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)

**నేటి సాక్షి - జగిత్యాల(రాధారపు నర్సయ్య):** గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలని, గ్రామాభివృద్ధి కోసం కృషి చేయడం తల్లికి సేవ చేసినట్లేనని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ మరియు స్త్రీ–శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లాలో నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచుల కోసం నిర్వహిస్తున్న ఐదు రోజుల ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**నూకపల్లి న్యాక్ సెంటర్‌లో శిక్షణ ప్రారంభం**

బుధవారం నూకపల్లి న్యాక్ సెంటర్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్లతో కలిసి పాల్గొన్నారు. ఈ శిక్షణ ద్వారా నూతన సర్పంచులకు పాలనా నైపుణ్యాలు, అభివృద్ధి విధానాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

**మూడు విడతల్లో 385 మంది సర్పంచులకు శిక్షణ**

జగిత్యాల జిల్లాలో మూడు విడతలుగా మొత్తం 385 మంది సర్పంచులకు శిక్షణ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ నెల 19 నుంచి 23 వరకు మొదటి విడతగా 122 మంది సర్పంచులకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్‌ను ఆమె అభినందించారు.

**ఎన్నికల గెలుపుతో బాధ్యత మరింత పెరుగుతుంది**

ఎన్నికల్లో గెలుపుతో బాధ్యత మరింత పెరుగుతుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుంచుకొని గ్రామ సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని సర్పంచులకు సూచించారు.

**పదవులు శాశ్వతం కావు పనులే చిరస్థాయి**

మన పదవులు శాశ్వతం కావని, కానీ మనం చేసే పనులు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని మంత్రి అన్నారు. అందుకే గ్రామాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించాలని హితవు పలికారు

**నిధుల వినియోగంపై అవగాహన అవసరం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు నేరుగా గ్రామపంచాయతీలకు చేరుతాయని తెలిపారు. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి అవసరమైన పరిపాలనా అవగాహన ఈ శిక్షణ ద్వారా లభిస్తుందన్నారు.

**గ్రామానికి సేవ చేస్తే ప్రజల గుండెల్లో స్థానం**

గ్రామాన్ని అభివృద్ధి చేస్తే ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని, గ్రామంలో చిరస్థాయిగా నిలిచేలా సర్పంచులు పనిచేయాలని మంత్రి సూచించారు. జగిత్యాల జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని కోరారు.

**ఉపాధి హామీ, సంక్షేమ పథకాల అమలు**

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వచ్చిన మార్పులను గమనిస్తూ, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

**నిరుపేదల గుర్తింపు - సామాజిక బాధ్యత**

గ్రామాల్లోని నిరుపేదలను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేలా చూడాలని, బాల్య వివాహాల నివారణ, యువతకు నైపుణ్య శిక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు.

**గ్రామపంచాయితీలకు భారీ నిధులు**

తెలంగాణ ప్రజా ప్రభుత్వం గ్రామపంచాయితీలకు ఇటీవల రూ.277 కోట్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. అలాగే గత రెండేళ్లుగా నిలిచిపోయిన కేంద్ర నిధులు సుమారు రూ.2,000 కోట్లు త్వరలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

**ఆదర్శ గ్రామాల దిశగా ముందడుగు**

పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని, కేరళ గ్రామాలను ఆదర్శంగా తీసుకొని అవార్డులు సాధించే స్థాయికి తీసుకెళ్లాలని సర్పంచులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జెడ్పీ సీఈఓ గౌతం రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, డిప్యూటీ సీఈఓ పి. నరేష్, జిల్లా పంచాయతీ అధికారి మదన్మోహన్, డీడబ్ల్యూఓ బి. నరేష్, పీఆర్ ఈఈ లక్ష్మణ్ రావు, శిక్షణ డీపీవో రేవంత్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, టీవోటీలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ కమిటీ అధ్యక్షునిపై టీడీపీ దాడి

- వేలాది మంది జనం, ఎమ్మెల్యే సమక్షంలోనే దాడి
- జల్లికట్టులో వైఎస్ఆర్‌సీపీ జెండా పలకలు కడితే కొడతారా..?
- పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడమే కారణం
- మీడియా ముందు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తీవ్ర విమర్శలు

**నేటి సాక్షి - తిరుపతి చంద్రగిరి:** చంద్రగిరి మండలం ఎ.రంగంపేట వైఎస్ఆర్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు పడాకుల శేషాద్రి రెడ్డిపై టీడీపీ వర్గీయులు భౌతిక దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరచిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి బుధవారం బాధితుడిని పరామర్శించారు. శేషాద్రి రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ“జల్లికట్టులో వైఎస్ఆర్‌సీపీ జెండా పలకలు కడితే కొడతారా..? ప్రశాంతంగా ఉన్న పల్లెలకు రక్తపు మరకలు అంటించడం ఎంతవరకు సమంజసం?” అని ప్రశ్నించారు. వేలాది మంది ప్రజలు చూస్తుండగానే, ఎమ్మెల్యే సమక్షంలోనే వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తపై దాడి జరగడం దారుణమన్నారు. గత ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ అప్పటి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్ని రాజకీయ పార్టీల నాయకులను సమానంగా చూసుకున్నారని గుర్తు చేశారు. వైఎస్ఆర్‌సీపీ నేతలు గొడవలకు దిగితే వారిపైనే కేసులు పెట్టించి పల్లెల్లో శాంతిని నెలకొల్పారని తెలిపారు. ప్రతిపక్షాలను ప్రత్యర్థులుగా మాత్రమే చూశామని, శత్రువులుగా ఎప్పుడూ చూడలేదన్నారు. అయితే ప్రస్తుతం చంద్రగిరి నియోజకవర్గంలో ఆ పరిస్థితి కనబడటం లేదని, వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలపై వరుస దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం వల్లే ఇలాంటి ఘటనలు తరచుగా జరుగుతున్నాయని ఆరోపించారు.



సహనం ఒక స్థాయి వరకు మాత్రమే ఉంటుందని, ఎదురుదాడులు మొదలైతే దానికి పోలీసులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తల రక్షణ కోసం ఎంత దూరమైనా వెళ్లేందుకు సిద్ధమని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. శేషాద్రి రెడ్డి కుటుంబానికి వైఎస్ఆర్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీలు బోసు చంద్రారెడ్డి, బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, ఉపసర్పంచ్ మోనీష్ రెడ్డి, పాకాల చరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పగిడిమర్రి గ్రామాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు

- విద్యార్థులు సేవ భావంతో పాటు సామాజిక భాధ్యతను నిర్వహిస్తారు
- ఎంపిడిఓ వేద రక్షిత



**నేటిసాక్షి, నల్లగొండ :** పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి,) నల్లగొండ కళాశాల ప్రిన్సిపాల్ డా. సముద్రాలు ఉపేందర్ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ఆధ్వర్యంలో దోరేపల్లి గ్రామంలో మరియు ఎన్ఎస్ఎస్ యూనిట్ 6 ఆధ్వర్యంలో పగిడిమర్రి గ్రామాలలో శీతాకాల ప్రత్యేక శిబిరాలను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకట రమణారెడ్డి, ముఖ్య అతిథి కనగల్ మండలం ఎంపిడిఓ వేద రక్షిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథి కనగల్ మండలం ఎంపిడిఓ వేద రక్షిత మాట్లాడుతూ, విద్యార్థులలో ఉన్న సేవాభావాన్ని వెలికి తీసే అవకాశంతో బాటు మంచి వ్యక్తిత్వం గల పౌరులుగా తయారువుతారని అన్నారు. అనంతరం మహాత్మా గాంధీ యూనివర్సిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించే ప్రత్యేక శిబిరాలను గ్రామప్రజలకు సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలు, అక్షరాస్యత, ఆరోగ్యం పై అవగాహన సాంస్కృతిక కార్యకలాపాల రూపంలో ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. పగిడిమర్రి గ్రామ సర్పంచ్ మరియు దోరేపల్లి సర్పంచ్ లు మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ యూనిట్ శిక్ష ఆధ్వర్యంలో మా గ్రామంలో వారం రోజులపాటు శ్రమదానంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగిస్తున్నందుకు మా గ్రామానికి విచ్చేసిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పగిడిమర్రి గ్రామ సర్పంచ్ నాగవల్లి నాగమణి, లింగాల గూడెం సర్పంచ్ కదిరే సైదులు, కిసాన్ సెల్ జిల్లా ప్రెసిడెంట్ గోలి జగాల్ రెడ్డి, ఎనిమిదో వార్డు మెంబర్ గాజుల మారయ్య, ఒకటవ వార్డు మెంబర్ దాసరి లక్ష్మి, నాల్గవ వార్డు నెంబర్ దాసరి అంజమ్మ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కన్నెబోయిన నరసింహ, కదిరే నాగరాజు, యన్ యస్ యస్ యూనిట్స్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ నర్సింగ్ కోటయ్య, కంబాల పల్లి శివరాణి, కదిర నాగరాజు డాక్టర్ అంకుష్,బోధన మరియు బోధనేతర సిబ్బంది, గ్రామ ప్రజలు ప్రజలు ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

# రాంబాబును అత్యదిక మెజారిటితో గెలిపించాలి

- సాధినేని స్రవంతి శ్రీనివాస రావు



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలోని 6వ వార్డు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా భూక్య రాంబాబు ను అత్యధిక మెజారితో గెలిపించాలని 6వ వార్డు బీఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్ సాధినేని స్రవంతి శ్రీనివాస రావు అన్నారు. బుధవారం 6వ వార్డులో మాజీ కౌన్సిలర్ సాధినేని శ్రీనివాస రావు ఆధ్వర్యంలో కాలనీలోని పార్టీ ముఖ్య నాయకుల మరియు కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ సాధినేని స్రవంతి శ్రీనివాస రావు మాట్లాడుతూ, మన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు పిఏ భూక్య రాంబాబు ను అత్యధిక మెజారిటీతో అందరం సమిష్టి గా పని చేసి, గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు బీఆర్ఎస్ అధ్యక్షులు సుంకోజు మురళి చారి, తిరందాస్ విష్ణు, షేక్ ఫయాజ్, మెరుగు రాజు యాదవ్, వర్కాల సురేష్, సాధినేని శ్రీనివాస రావు, పులిపలుపుల శ్రీనివాస్ గౌడ్, హాజార్ సింగ్, మేకల వెంకన్న, రేవన్,వి.వి రావు,రఘురామయ్య, ఇస్లావత్ రమేష్, లాలు నాయక్, రమేష్ చారి,నాగర్జు, పానుగోతు సురేష్, యాదగిరి రాజు, అలీం భాయ్, ఇక్బాల్, సాంబయ్య చారి తదితరులు ఉన్నారు.

# పదవ తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

- తిమ్మాపూర్ సర్పంచ్ పోసాన్ పల్లి రాజు



**నేటిసాక్షి : జగదేవపూర్ :** జెడ్పి హెచ్ఎస్ తిమ్మాపూర్ పాఠశాల లో బుధవారం పాఠశాల పదవ తరగతి విద్యార్థులు వారి తల్లితండ్రులు మరియు స్కూల్ టీచర్స్ తో సమావేశం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ పోసాన్ పల్లి రాజు హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ మాట్లాడారు విద్యార్థులు అందరూ 100% ఉత్తీర్ణత సాధించాలని కోరారు. పబ్లిక్ పరీక్షలకు కేవలం 50రోజులు మాత్రమే ఉంది కావున ప్రతి విద్యార్థి ఒక ప్రణాళిక బద్ధంగా చదవాలని తెలిపారు. పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో తల్లి తండ్రులు విద్యార్థులకు ఏ విధమైన పనులు చెప్పకుండా వారికి ఇంట్లో ఒక ప్రశాంతమైన వాతావరణ కలిగిన ప్రదేశాన్ని కేటాయించి వారి యొక్క చదువులకు ఆటంకం కలగకుండా చూడాలని కోరారు విద్యార్థులు ఈ 50 రోజులు సబ్జెక్టుల వారిగా సమయాన్ని వృథా చేయకుండా ప్రతి ఒక్కరు అత్యధిక మార్కులు సాధించే విధంగా కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం శ్రీనివాసు స్థానిక ఉపసర్పంచ్ అక్కరాజు నాగరాజు పాఠశాల ఉపాధ్యాయులు విద్యా కమిటీ అధ్యక్షులు కొంత కృష్ణంరాజు ప్రధాన కార్యదర్శి దండు నవీన్ కొంతం కిష్టయ్య మహేష్ కొంతం రాజు శ్రీశైలం ఆగమల్లు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# రోడ్డు భద్రత....ప్రతి ఒక్కరి బాధ్యత

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** వాహనాలను నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని, మన అజాగ్రత్త మనకే కాక ఇతరులకు కూడా ప్రమాదాలను కలిగిస్తుందని, కనుక రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మిర్యాలగూడ వన్ టౌన్ ఏఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ కాంపెయిన్ -లో భాగంగా డీజీపీ. బి. శివధర్ రెడ్డి, నల్లగొండ ఎస్పీ శరత్ పవార్ ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మల్గిరెడ్డి భీమార్జున రెడ్డి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్. యూనిట్ 1 మరియు 2 ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థినీ, విద్యార్థులు రోడ్డు భద్రత పట్ల అవగాహన పెంచుకొని, ప్రమాదాల బారిన పడకుండా, తమ ప్రాణాలను ఏ విధంగా కాపాడుకోవాలో తెలియజేశారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల ద్వారా అనేకమంది మృతి చెందుతున్నారని, కనుక ప్రతి ఒక్కరు ఈ విషయాన్ని గమనించి, రోడ్డు భద్రతా చర్యలను పాటిస్తూ ప్రమాదాల బారిన పడకుండా, జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ, లైసెన్స్ లేకుండా వాహనాలను నడపవద్దని తెలియజేసారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ బీమార్జున రెడ్డి మాట్లాడుతూ, మన అజాగ్రత్త వల్ల కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉందని, నేటి యువత అతి వేగంతో, బాధ్యతా రాహిత్యంతో



వాహనాలను నడిపి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, కనుక హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది బాష్యానాయక్, గోపమ్మ, హుస్సేన్, సైదులు మరియు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు నమోదు చేసిన పంటనే..పండించాలి

- వ్యవసాయ శాఖ అధికారి రుషేంద్ర మణి



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** రైతులు తమ పండించే పంట వివరాలను యాప్ లో తప్పకుండా నమోదు చేయాలని దామరచర్ల మండలం వ్యవసాయ శాఖ అధికారి రుచేంద్ర మణి అన్నారు. బుధవారం దామరచర్ల మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియ యాప్ ద్వారా రైతులకు యూరియ అందిస్తున్నామని, రైతులు యూరియ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ లో బుక్ చేసుకునేటప్పుడు రైతులు ఏ పంట వివరాలు నమోదు చేశారో, ఆ పంటనే వేయాలని, వేరే పంట వేసుకోకూడదని సూచించారు. రైతులు యూరియ యాప్ లో బుక్ చేసుకోని, 24గం లల్లో తోసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమములో వ్యవసాయా విస్తరణ అధికారి పార్వతి, వ్యవసాయ శాఖ అధికారి సీఈఓ వెంకట్ రెడ్డి, రైతులు కుందురు రాంరెడ్డి, వీరకోటి రెడ్డి, లావురి దస్రు, వినోద్, మట్టయ్య, గోవిందు తదితరులు ఉన్నారు.

# గుడ్ టచ్ బ్యాడ్ టచ్



**నేటి సాక్షి,కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ :** జిల్లా ఎస్పీ శ్రీమతి నితిక పంత్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రోగ్రెస్ పాఠశాలలో విద్యార్థులకు ఆసిఫాబాద్ షీ టీమ్ సభ్యులు భద్రత, పోలీస్ రక్షణతో పాటు పలు అంశాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యులు చిన్న పిల్లలకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, వ్యక్తిగత పరిశుభ్రత, అనుమానిత వ్యక్తుల నుంచి తినుబండారాలు స్వీకరించకూడదని, సోషల్ మీడియా ప్రభావం, మొబైల్ ఫోన్‌ను అధికంగా వినియోగించడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై వివరించారు. చిన్న పిల్లలు, విద్యార్థుల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ కృషి చేస్తారని తెలిపారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఆసిఫాబాద్ షీ టీమ్ నెంబర్ 8712670564 కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ బషీర్, షీ టీమ్ సిబ్బంది స్వప్న, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీకి కంప్యూటర్ వెయిట్ మెషిన్

## డొనేట్ చేసిన సమాజ సేవకుడు నవీన్ కుమార్ గౌడ్



**నేటి సాక్షి పాములపాడు:-** పాములపాడు మండలంలోని, లింగాల గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రం-2కి సమాజ సేవకుడు నవీన్ కుమార్ గౌడ్ కంప్యూటర్, వెయిట్ మెషిన్ ను డొనేట్ చేయడం జరిగింది. ప్రతి రోజూ పిల్లలకు వెయిట్ చూడడానికి మరియు వారికి వెయిట్ చూసిన వెంటనే బరువులో తేడా వస్తే మంచి పౌష్టికాహారం అందించడానికి మాకు తెలుస్తుందని అంగన్వాడీ కేంద్రం వర్కర్స్ స్ బి.రమాదేవి మరియు ఆయా వెంకటేశ్వరమ్మ, గ్రామ పెద్దలు సమాజ సేవకుడు నవీన్ కుమార్ గౌడ్‌ను అభినందించారు. ఇలాంటి సేవాకార్యక్రమాలు మున్ముందు కూడా కొనసాగుతాయని సమాజ సేవకుడు నవీన్ కుమార్ గౌడ్ తెలిపారు.

# మరకత శివాలయానికి ఆహ్వానం

## టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డికి ఆహ్వానం



**నేటి సాక్షి । శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో 11వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయాన్ని దర్శించాల్సిందిగా తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డిని శివాలయ ప్రచార కమిటీ సభ్యులు ఆహ్వానించారు. బుధవారం తిరుపతిలోని భానుప్రకాష్ రెడ్డి నివాసంలో శివాలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామివారి శేష వస్త్రంతో సన్మానించి, శివాలయ చిత్రపటాన్ని బహుకరించి అధికారికంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ రెడ్డి స్పందిస్తూ హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంలో పురాతనమైన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయాన్ని తప్పకుండా దర్శించుకుంటానని తెలిపారు. ఈ విషయాన్ని దయాకర్ రాజు వెల్లడించారు..

# పోషక ఆహారాన్ని తీసుకోవాలి

## అలిరాజపేట సర్పంచ్ రాచమల్ల ఎల్లేష్



**నేటిసాక్షి జగదేవపూం:** గర్భిణీ స్త్రీలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని జగదేవ్ పూర్ మండల పరిధిలోని అలిరాజపేట గ్రామ సర్పంచ్ రాచమల్ల ఎల్లేష్ సూచించారు. గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గ్రామంలోని స్థానిక అంగన్వాడీ కేంద్రంలో పలువురు గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ ఎల్లేష్ మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల గర్భస్థ శిషువులు ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. ప్రభుత్వం గర్భిణీ స్త్రీల సంక్షేమం కోసం సకాలంలో మరింత నాణ్యమైన ఆహారాన్ని అందించుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ క్రమంలో ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలను గర్భిణీ స్త్రీలు అందరూ సక్రమంగా సద్విని చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రేణుక (టీచర్) సౌందర్య (హెల్పర్) కవిత(ఆశ వర్కర్) బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు బాపురెడ్డి అల్లిరాజుపేట గ్రామపంచాయతీ పాలకవర్గం పాల్గొన్నారు

# ఇటిక్యాలలో క్రీడా పోటీలు



**నేటిసాక్షి : జగదేవపూర్ :** జగదేవపూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ క్రీడా కమిటి అధ్యక్షులు నర్సొళ్ల ఐలయ్య, ఉపాధ్యక్షులు తుమ్మ సంతోష్-మన్నె హేమంత్, ప్రధాన కార్యదర్శి బక్కోళ్ల మల్లేష్,ఆర్గనైజర్ బత్తిని ప్రవీణ్, కోశాధికారి ఎల్లోళ్ల నాగరాజు, కార్యదర్శి వీరబత్తిని అజయ్ గార్ల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. ఈ పోటీల్లో విన్నర్ గా తుమ్మ సంతోష్ అండ్ టీం కప్ తో పాటు 5000ప్రైజ్ మనీ రన్నర్ గా స్వామి అండ్ టీం కప్ తో పాటు 2500 ప్రైజ్ మనీ గెల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దాతలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విజేతగా నిల్చిన తుమ్మ సంతోష్ అండ్ టీం తమ ప్రైజ్ మనీ నుండి గ్రామంలో అనారోగ్యం బారిన పడ్డ ఎర్రోళ్ల ఆనంద్ కి ఒక నెలకు సరిపడే మందుల కోసం ఆర్థిక సహాయం చేయడం జరిగింది.

# విద్యుత్ షాక్ తో మేక మృతి



**నేటి సాక్షి, జగిత్యాల(గుండ ప్రశాంత్ గౌడ్ ):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం గుంజపడుగు.గ్రామంలో మంగళవారం రోజున మారం కొమురయ్య కొన్ని సంవత్సరాలు నుండి గొర్రెలు మేకలు కాసుకుంటా జీవనం సాగిసున్నాడు మేక మందల నుండి పక్కన ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌కి తగిలి 17 వేల విలువ గల మేక మృతి చెందింది కుటుంబ పోషణ కోసం జీవనం సాగిస్తున్నని అని మేక మృతి వల్ల జీవన్ ఉపాధి కోల్పోయిమని మేక యజమాని కొమురయ్య వాపోయాడు విద్యుత్ శాఖ వాళ్లు స్పందించి నష్టపరిహారం ఇవ్వవలసిందిగా యజమాని కోరుతున్నారు